
తగ్గిన దసరా కిక్కు!

వైరా, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో దసరాకు మద్యం కిక్కు తగ్గింది. ఈ ఏడాది ప్రభుత్వం పెంచిన మద్యం రేట్ల కారణంగా గత ఏడాది కంటే ఈ ఏడాది కేవలం రూ.52 లక్షలు మాత్రమే అధిక ఆదాయం లభించింది. ఈ సెప్టెంబర్‌లో రూ.185.38 కోట్ల మద్యం విక్రయాలు జరుగ గా, గతేడాది సెప్టెంబరులో రూ.184.86 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. అలాగే ఐఎంఎల్ నుంచి 2,34,135 కేసులు కాగా గతేడాది 2,49,037 కేసుల మద్యాన్ని సరఫరా చేశారు. అంటే ఈ ఏడాది 14,902 కేసుల సరఫరా తగ్గింది. బీర్లు కూడా గతేడాదితో పోల్చితే ఈ ఏడాది సరఫరా తక్కువ. దీనంతటికీ కారణం మద్యం రేట్లు పెరగడం వలన ఈ ఏడాది ప్రభుత్వ ఆదాయం భారీగా తగ్గింది. ఈ గణాంకాల ప్రకారం చూస్తే ఖమ్మం జిల్లాలో ప్రభుత్వం ఆశించిన రీతిలో మందుబాబులకు దసరా కిక్కు ఇవ్వలేదు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
సోమవారం 6 అక్టోబరు 2025





సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ నారాయణ

ఆదాయం అదుర్స్

మూడేళ్లలో రూ.390కోట్ల ఇసుక సీనరేజ్ ఫీజు

- మెటల్ క్వారీలకు మరో రూ.133కోట్లు
- జిల్లా సర్వే రిపోర్టులో పేర్కొన్న అధికారులు
- అభ్యంతరాలు తెలపాలని కోరిన కలెక్టర్
- అనధికారిక తరలింపే అధికం?



రాష్ట్రంలోనే భద్రాద్రి జిల్లా ఇసుక వనరులకు పేరొందింది. జిల్లాలో గోదావరితోపాటు మరో ఏడు నదుల నుంచి ఇసుకను తీసి విక్రయాలు జరపడం.. ఆ ఇసుకను ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు హైదరాబాద్, ఇతర ప్రధాన కేంద్రాలకు తరలించి విక్రయాలు జరుపుతుంటారు. ఈ ఇసుక రీచ్‌ల ద్వారా రాష్ట్ర ఖజానాకు భారీ ఆదాయం చేకూరుతూ వస్తోంది. అలా గడిచిన మూడేళ్లలో సుమారు రూ.390కోట్లకు పైగా ఆదాయం సమకూరినట్టు అధికారులు లెక్కలు తేల్చారు. వాటితోపాటు ఇతర మెటల్ క్వారీల ద్వారా చెల్లించిన రాయల్టీ రూ.133కోట్లున్నాయి.

కొత్తగూడెం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఇటీవల ఇచ్చిన ఆదేశాలకనుగుణంగా పలు శాఖల ఆధ్వర్యంలో ఇసుక తవ్వకాలకు సంబంధించి జిల్లా అధికారులు సర్వే నివేదిక తయారు చేసి జిల్లా వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. కాగా సదరు నివేదికకు సంబంధించి సూచనలు, సందేహాలతోపాటు, ఇతర అభ్యంతరాలు ఏమైన ఉంటే తెలపాలని జిల్లా కలెక్టర్ కోరారు.

120 పేజీల నివేదికలో అంశాలు ఇలా..

జిల్లాలో మూడు క్వారీలకు సంబంధించి మైనింగ్ లీజులు కొనసాగుతున్నాయి. వాటిలో స్టోన్, మెటల్‌కు సంబంధించి 6.33హెక్టార్ల ప్రభుత్వ భూమి, 4.737 హెక్టార్ల పట్టా భూమి లీజులున్నాయి. ఆయా లీజులకు సంబంధించి పాల్వంచ మండలంలోని తొగ్గూడెం గ్రామంలోని 2018లో అనుమతులివ్వగా 2028 వరకు లీజు ఉన్నట్టు అధికారులు పేర్కొన్నారు. జూలూరుపాడు మండలంలోని గుండెపూడి గ్రామంలో గ్రావెల్, స్టోన్, మెటల్ క్వారీకి సంబంధించి 2022లో అనుమతులివ్వగా.. వాటికి సంబంధించి 2042 వరకు అనుమతులు ఉన్నట్టు డీఎస్‌ఆర్‌లో పేర్కొన్నారు. గడిచిన మూడేళ్లలో సంబంధిత క్వారీల ద్వారా 79,521 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరగ్గా 133.41 కోట్ల రాయల్టీ వచ్చినట్టు తెలిపారు. ఇసుకకు సంబంధించి జిల్లాలో ఏడు నదీతీరాల్లో ఇసుక లభించే అవకాశం ఉండగా.. గోదావరికి సంబంధించి పినపాక, మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు, చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం ప్రాంతాల్లో, కిన్నెరసానికి సంబంధించి పాల్వంచ, బూర్గంపాడు, ముర్రేడు తీరానికి సంబంధించి కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ, బూర్గంపాడు, పినపాక ప్రాంతంలో పెద్దవాగు, గుండాల ప్రాంతంలో జిల్లేరు, చర్ల ప్రాంతంలో తాలిపేరు, ముల్కలపల్లి ప్రాంతంలో పాములేరు, అశ్వారావుపేట ప్రాంతంలో గుండేటివాగుల నుంచి ఇసుక లభించనున్నట్టు రిపోర్టులో పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో గడిచిన మూడేళ్లలో 62,27,968 క్యూబిక్ మీటర్లలో ఇసుక తవ్వకాలు జరిపినట్టు వాటికి సీనరేజ్ చార్జీల రూపంలో రూ.390కోట్లు ఆదాయం వచ్చినట్టు తెలిపారు.

ఇసుకపై వచ్చిన ఆదాయం...

సవంత్సరం	సీనరేజ్ ఫీజు (కోట్లలో)	ఇసుక తవ్వకాలు (క్యూబిక్ మీటర్లు)
2022-23	136.29	24,30,189
2023-24	121.43	18,74,654
2024-25	133.16	19,23,125

మైనర్ మినరల్స్ ఆదాయం ఇలా...

సంవత్సరం	రాయల్టీ	ఉత్పత్తి (మెట్రిక్ టన్నులు)
2022-23	35.69	52,871
2023-24	51.06	16,600
2024-25	46.66	10,050

ఈ ఏడాది ఇచ్చిన అనుమతులు...

పలు సొసైటీలకుగాను ఈ ఏడాదికి సంబంధించి లీజులు ఇచ్చినట్టు (మిగతా 4వ పేజీలో)

ఉద్యమ గుమ్మం నుంచే రణ నినాదం

- ప్రజాస్వామ్య పరిరక్షణకు పునరంకింతం కావాలి
- చరిత్రలో నిలిచిపోయేలా శతజయంత్యుత్సవాల ముగింపు సభ
- ఆహ్వాన కమిటీ సమావేశంలో నారాయణ, కూనంనేని

ఖమ్మం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : ఉద్యమ గుమ్మం ఖమ్మం నుంచే రణనినాదం మోగించాలని, ప్రజాస్వామ్య పరిరక్షణకు పునరంకితం కావాలని సీపీఐ జాతీయ, రాష్ట్ర నేతలు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. డిసెంబరు 26న ఖమ్మంలో జరిగే సీపీఐ శతజయంత్యుత్సవాల ముగింపు సభకు సంబంధించిన ఏర్పాట్లపై ఆదివారం ఖమ్మం ఎస్ఆర్ గార్డెన్స్‌లో సన్నాహక కమిటీ సమావేశం జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె.నారాయణ మాట్లాడుతూ సీపీఐ శతజయంత్యుత్సవాల ముగింపు సభను చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహించేందుకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. దేశచరిత్రలో ఖమ్మానికి ఒక ప్రత్యేకస్థానం ఉందని, ఆంధ్ర మహాసభ ద్వారా నిజాం పతనానికి నాంది పలికిన చరిత్ర ఈ నేలకుందన్నారు. దున్నేవాడిదే భూమి అనే నినాదంతో 1925లో భూ సమస్యల పరిష్కారానికి జరిగిన పోరాటానికి ఖమ్మం వేదికగా నిలిచిందని, ఇటు నిజాం వ్యతిరేక పోరాటం, బ్రిటీష్ వ్యతిరేక పోరాటానికి, స్వాతంత్ర్య సాధనకు పోరాడిన వారిలో ఎందరో ఈప్రాంత వాసులున్నారన్నారు. ఆ స్ఫూర్తితో పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతీ ఒక్కరు కృషిచేయాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడాల్సిన గవర్నర్లే ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగ స్ఫూర్తిని బీజేపీ దెబ్బతీస్తోందని, బ్లాక్‌మెయిల్ రాజకీయాలతో నరేంద్రమోదీ పాలన సాగుతోందని, ఎంతోమంది దోపిడిదార్లకు బెయిల్ వస్తున్నా వరవరరావు లాంటివారికి బెయిల్‌రాకపోవడం శోచనీయమన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఖమ్మంలో జరిగే పార్టీ శతజయంత్యుత్సవ (మిగతా 4వ పేజీలో)

శబరిస్మృతి యాత్రకు పుష్కరకాలం

రేపు భద్రాద్రిలో దేవస్థానం ఆధ్వర్యంలో వేడుక

భద్రాచలం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం శబరి స్మృతి యాత్రను నిర్వహించనున్నారు. గత పుష్కర కాలంగా దేవస్థానం ఆధ్వర్యంలో శబరిస్మృతి యాత్రను నిర్వహిస్తున్నారు. వాల్మీకి రామాయణంలో చాలా నిడివి తక్కువ గల పాత్ర అయినప్పటికీ శబరికి ఉన్న ప్రాధాన్యత చాలా విశేషమైంది. మాతంగ మహర్షి ఆశ్రమంలో పరిచారికగా మహర్షులకు సేవలు చేస్తూ తరిస్తున్న శబరి రామచంద్రమూర్తి రాక కోసం వేచి చూసి సీతాన్వేషణ నిమిత్తమై తన దగ్గరకు వచ్చిన రామ లక్ష్మణులను చూసి ఎంతో పొంగిపోతుంది. రుచికరమైన పండ్లను ఏరి ఏరి తీసు కొచ్చి రామచంద్రునికి సమర్పించి ఆనందించింది. రాముని అనుగ్రహంతో ముక్తిని పొందింది. అలా ఆ మహాసాధ్వి స్మృతిగా భద్రాచలం పరిసర ప్రాంతాల్లో ఉన్న గిరిజనులను కూడా ఈ ఉత్సవంలో భాగస్వామ్యం చేస్తూ అత్యంత వైభవంగా భద్రాద్రి దేవస్థానం శబరి స్మృతి యాత్రను చేపట్టింది. వారు తెచ్చిన పలు రకాల ఫలాలతో, పూలతో రామచంద్ర మూర్తికి పూజాది కార్యక్రమాలను నిర్వహిస్తారు. ముందుగా గిరి ప్రదక్షిణ, తదుపరి కల్యాణోత్సవం, అనంతరం గిరిజనులు తెచ్చిన ఫలాలతో అర్చన, మంత్రపుష్పంతో శబరి స్మృతి యాత్ర ముగుస్తుంది. ఈ యాత్రలో భాగంగా ఉదయం గిరి ప్రదక్షిణ, నిత్య కల్యాణ మహోత్సవం, స్వామి వారికి వివిధ పుష్పాలు, ఫలాలతో మంత్రపుష్పం, ప్రసాద వినియోగం ఉంటాయి. ఈ ఉత్సవానికి 2013 అక్టోబరు 18న అప్పటి స్పెసిఫైడ్ అథారిటీ చైర్మన్ అయిన వినోద్‌కుమార్ అగర్వాల్ శ్రీకారం చుట్టారు. 2013నుంచి ప్రతి ఏటా ఆశ్వీయుజమాసంలో పౌర్ణమి రోజున ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా మంగళవారం 12వ సారి ఈ ఉత్సవాన్ని నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



గిరిజనులను రప్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు

భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవంలో పాల్గొనేందుకు వచ్చే గిరిజనులను ఏజెన్సీలోని వివిధ ప్రాంతాల నుంచి తరలించేందుకు భద్రాద్రి దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వాజేడు, వరరామచంద్రాపురం, అశ్వారావుపేట, ఇల్లెందు, జూలూరుపాడు తదితర ప్రాంతాల నుంచి గిరిజనులను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు వారు తెలిపారు. వాస్తవానికి గతంలో దేవస్థానం ఆధ్వర్యంలో భద్రాచలంతో పాటు ఏజెన్సీలోని మారుమూల గ్రామంలో దమ్మక్క సేవాయాత్ర, శబరి స్మృతి యాత్రలను నిర్వహించేవారు. అయితే ఈసారి భద్రాద్రి దేవస్థానం భద్రాచలంలోనే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు తానీషా కల్యాణ మండపంలో ఉచిత వసతి ఏర్పాట్లను చేస్తున్నారు. వారికి అల్పాహారం, అన్నప్రసాదం, లడ్డూ ప్రసాదం అందజేయనున్నట్లు దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు తెలిపారు.


రామయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం(ఫైల్)

8న పీవోలు, ఏపీవోలకు శిక్షణ

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీరాజ్ యంత్రాంగం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సమాయత్తమవుతోంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల నాటికే దశలవారీగా కార్యక్రమాలను నిర్వహిస్తూ సిద్ధంగా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో 20జడ్పీటీసీ స్థానాలతో పాటు 283 ఎంపీటీసీ స్థానాలున్నాయి.వీటిలో ఇప్పటికే రిజర్వేషన్లు ఖరారు చేశారు. వీటి పరిధిలో పోలింగ్ నిర్వహణ అంతా పీవో, ఏపీవోలపైనే ఆధారపడి ఉంటుంది. పోలింగ్ సమర్థవంతంగా నిర్వహించేందుకు తొలుత ఎన్నికల నిబంధనల అమలుపై శిక్షణ ఇవ్వడం ఆనవాయితీ. పోలింగ్ నిర్వహణ కోసం సుమారు 800 మంది పీవో, ఏపీవోలుగా ఎంపిక చేశారు.వీరందరికీ మండలాల్లో ఈనెల 8న శిక్షణ ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. వీరిలో అధికంగా ఉపాధ్యాయులే ఉన్నట్లు సమాచారం. ఆయా మండల ఎంపీడీవోల పర్యవేక్షణలో శిక్షణ ఇవ్వనున్నారు.

రేపు పంచాయతీ ఎన్నికల సిబ్బందికి..

ఖమ్మంలో మంగళవారం భక్తరామదాసు కళాక్షేత్రంలో పంచాయతీ పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. మొత్తం 571పంచాయతీలకు మూడువిడతల్లో జరిగే ఈ ఎన్నికల్లో 191 మంది ఆర్వోలు, 191 మంది ఏఆర్వోలతో పాటు రిజర్వ్‌కింద 70మంది సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు.


భద్రాచలం వద్ద గోదావరికి నిమజ్జనానికి వచ్చిన అమ్మవారి విగ్రహాలు

గోదావరి తీరంలో నిమజ్జన సందడి

- భద్రాచలం తరలివచ్చిన 350 విగ్రహాలు
- ప్రశాంతంగా సాగిన కార్యక్రమం
- పర్యవేక్షించిన సబ్‌కలెక్టర్ మృణాల్‌శ్రేష్ఠ

5



ఘనంగా కోట మైసమ్మతల్లి జాతర

- నాలుగు రోజులుగా జరుగుతున్న ఉత్సవాలు
- అమ్మవారిని దర్శించుకున్న లక్షలాదిమంది భక్తులు

4

బీఆర్ఎస్‌పై మాజీ ఎమ్మెల్యే తాటి తిరుగుబాటు!

- జిల్లా అధ్యక్షుడు రేగా, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మెచ్చా వైఖరిపై మండిపాటు
- పార్టీని నాశనం చేస్తున్నారంటూ ఆగ్రహం..
- అధినాయకత్వానికి తెలిపినా పట్టించుకోవడం లేదని ఆవేదన
- నాయకులు, కార్యకర్తలకు విలువ ఇవ్వకపోతే మూల్యం తప్పదు
- ఒంటెత్తు పోకడ పోతే తిరుగుబాటు తప్పదని తాటి వెంకటేశ్వర్లు హెచ్చరికలు
- ఇటీవల బీఆర్ఎస్ సమావేశాన్ని బహిష్కరించిన మండల ముఖ్య నాయకులు

5



అర్హులకు దక్కని ఇందిరమ్మ ఇళ్లు

- ఇల్లులేని పేదరాలికి ఎల్-3 స్టేటస్
- నాలుగు చక్రాల వాహనాలున్న వారికీ కేటాయింపు

దుమ్ముగూడెం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): అద్దెకుంటున్న తాటాకు ఇల్లు కూలడమే ఆ వృద్ధురాలికి శాపమైంది. కనికరించిన ఇంటి యజమాని ఆమెకు తన పక్కాభవనంలో ఓ గదిలో ఆశ్రయం కల్పించడమే.. ఆమె ఇందిరమ్మ ఇంటికి అనర్హురాలిగా మిగిలింది. ఆ అభాగ్యురాలే లక్ష్మీనగరానికి చెందిన 70ఏళ్ల దల్లి సరోజ. భర్తను కోల్పోయిన ఆమెకు రెండున్నర సెంట్ల ఇంటి జాగా తప్ప పొలం, ఆస్తులు లేవు. ఆమెకు ముగ్గురు అమ్మాయిలు, కుమారుడున్నారు. కుమార్తెలకు వివాహమవగా, నిరుద్యోగి అయిన కుమారుడితో కలిసి జీవిస్తోంది. రెక్కాడితే గానీ డొక్కాడని ఆ కుటుంబానికి ఓ సొంత పూరిల్లుండగా, ఐదేళ్ల క్రితం అది కూలిపోయింది. నాటి నుంచి స్థానికంగా దొరికిన చోట అద్దెకు ఉంటూ జీవిస్తున్నారు. నిన్నమొన్నటి వరకు హోటల్, ఇతర కూలీ పనులతో కడుపు నింపుకున్న సరోజ, ప్రస్తుతం ఆరోగ్యం సహకరించకపోవడంతో మానేసింది. ప్రభుత్వం ఇస్తున్న వితంతు ఫించనుపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ ఆర్థిక నేపథ్యం గల వృద్ధురాలికి ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో ఎల్-3 స్టేటస్ ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్వే అధికారులు ఆమె ఆర్థిక, జీవన నేపథ్యాన్ని పక్కన బెట్టి, అరకొర అద్దె చెల్లించి ఉంటున్న డాబా గది ముందు నిలబెట్టి ఫొటో తీయడంతో ఆ వృద్ధురాలు ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు అందనంత దూరంలో మిగిలిపోయింది.

అనర్హులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు..

మండల వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు అర్హులుగా మూడు విభాగాల జాబితాలను అధికారులు తయారు చేశారు. ఎల్-1 జాబితాలో 5,687, ఎల్-2 జాబితాలో 437, ఎల్-3 జాబితాలో 8,981 మందిని గుర్తించారు. ఎల్-1 జాబితాలో ఇంటి స్థలం కలిగి ఉండి ఇల్లు లేకపోవడం, ఎల్-2లో ఇంటి స్థలం, ఇల్లు లేకపోవడం, ఎల్-3లో ఇల్లు కలిగి ఉన్నవారని గుర్తించారు. అయితే మండల వ్యాప్తంగా పలు గ్రామపంచాయతీల్లో గుర్తించిన ఎల్-1 జాబితాలో ఉన్న అర్హులతో పోలిస్తే వారికంటే కడు పేదరికంలో ఉన్నవారికి అవకాశం దక్కలేదనే విమర్శ ఉంది. లక్ష్మీనగరం గ్రామపంచాయతీ విషయానికి వస్తే పేద వృద్ధురాలు నివసిస్తున్న ఒక గది ఇల్లుకంటే మరింత మెరుగైన సదుపాయాలున్న గృహాల్లో అద్దెకున్నవారికి ఇళ్లు మంజూరవడం గమనార్హం. అలాగే లచ్చిగూడెం గ్రామపంచాయతీలో పేదలను పక్కన బెట్టి సొంతంగా నాలుగు చక్రాల వాహనాలున్నవారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరైందనే ఆరోపణ ఉంది. కాగా ఇందిరమ్మ ఇళ్ల జాబితాలను ప్రకటించిన తొలినాళ్లలో పలు గ్రామపంచాయతీ కార్యాలయాల ఎదుట అర్హులైన పలువురు పేదల తో ఆందోళనలు వెల్లువెత్తాయి.



ఇల్లు లేని వృద్ధురాలు సరోజ

ఎల్-3 స్టేటస్‌లో పడేశారు!

ఏదో ఒక ఇల్లు ఉన్న వారికి మాత్రమే ఎల్-3 స్టేటస్ ఇవ్వాల్సి ఉంది. వృద్ధురాలు సరోజకు ఇల్లు లేకపోయినా ఆమెను ఎల్-3 జాబితాకు ఎంపిక చేశారు. లక్ష్మీనగరం గ్రామపంచాయతీలో ఎల్-1 జాబితా నుంచి 19మందికి ఇళ్లు మంజూరయ్యాయి. వీరిలో కొందరు లబ్ధిదారులు బాధిత పేద వృద్ధురాలు సరోజతో పోలిస్తే మెరుగైన సదుపాయాలున్న పక్కా ఇళ్లలో నివసిస్తున్న వారే. వీరంతా ఇందిరమ్మ ఇళ్లకు అర్హులుగా ఎంపిక కాగా, సరోజ కేవలం ఒక చిన్న ఆర్‌సీసీ గదిలో అద్దెకుంటున్న కారణంగా ఆమెకు ఇల్లు దక్కక పోవడంపై పలు విమర్శలున్నాయి. మండల వ్యాప్తంగా ఇలాంటి అభాగ్యులు చాలా మంది ఉండగా, ఇందిరమ్మ ఇళ్ల జాబితాల ఎంపికలో రాజకీయ ఒత్తిళ్లతో అనర్హులకు పెద్దపీట వేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

తేనెతో ఆరోగ్య ప్రయోజనాలు

- తెలంగాణ టీహబ్ సొసైటీ అధ్యక్షుడు ఇంద్రారెడ్డి

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : తేనెవల్ల అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని తెలంగాణ టీహబ్ సొసైటీ అధ్యక్షుడు కే.ఇంద్రారెడ్డి అన్నారు. సయోధ్య ఎన్‌జీవో ఆధ్వర్యంలో మండలంలోని చంద్రాయపాలెంలో తేనెటీగల పెంపకంపై రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణా కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేనె శరీరంలో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుందని, దగ్గు, జలుబు, గొంతునొప్పి తదితర సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుందని తెలిపారు. తేనెటీగల పెంపకం, తేనె సేకరించడంలో పాటించాల్సిన అధునాతన పద్ధతులు, మార్కెటింగ్ విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 29మంది లబ్ధిదారులకు 96తేనెటీగల బాక్సులను అందించారు. కార్యక్రమంలో రేంజర్ స్నేహలత, ఎఫ్‌బీవో కృష్ణ, కిరణ్, టీహబ్ జనరల్ సెక్రటరీ నిమ్మల రామచంద్రమ్మ, డా.తిరుమలేష్, సయోధ్య ఎన్‌జీవో బాధ్యులు మృధుల, డా.సీతాలక్ష్మణ్, ఎయిడ్ సంస్థ బాధ్యులు బాబు, లబ్ధిదారులు పీ.చుక్కమ్మ, మట్టా పద్మ, రజిని, సురేష్, కుమార్, బత్తిన ఉష తదితరులు పాల్గొన్నారు.



చంద్రాయపాలెంలో లబ్ధిదారులకు తేనెటీగల పెట్టెలను అందిస్తున్న దృశ్యం

ఘనంగా కోటమైసమ్మతల్లి జాతర

- అమ్మవారిని దర్శించుకున్న లక్షలాదిమంది భక్తులు





కారేపల్లి, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న కోటమైసమ్మ తల్లిని లక్షలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. వేలాది సంఖ్యలో కోళ్లు, మేకలు, గొర్రెలను బలిచ్చారు. దీంతో జాతర ప్రాంగణం మొత్తం సందడి నెలకొంది. జాతరలో వందలాది సంఖ్యలో వివిధ రకా ల దుకాణాలు ఏర్పాటు చేశారు. కాగా జాయింట్‌వీల్స్, బ్రెకింగ్‌డాన్స్, రంగుల రాట్నం, స్విమ్మింగ్‌పూల్ వంటివి ఈసారి అనేకం ఏర్పాటు చేశారు. జాతరలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

బోర్డర్‌లో సేవకు వెంకట్రావుపేట యువకుడు



- గ్రామంలో మొట్టమొదటి ప్రభుత్వ కొలువు సాధించిన వినయ్

పినపాక, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): దేశ సరిహద్దుల్లో శత్రుమూకల దాడులను తిప్పికొట్టేందుకు రక్షణ కవచంలా నిలిచే ఉద్యోగానికి మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన పొనగంటి వినయ్ ఆర్మీ సోల్జర్‌గా గత ఏడాది ఎంపికయ్యాడు. శిక్షణ పూర్తి చేసుకుని, జమ్మూ లోని లడఖ్ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నాడు. కాగా తమ గ్రామం నుంచి తొలి ప్రభుత్వ కొలువు సాధించిన ఆ యువకుడికి అపూర్వ ఘనస్వాగతం పలికారు. గ్రామస్థులు. శిక్షణ పూర్తయ్యాక, విధుల్లో చేరిన జవాన్ వినయ్ తొలిసారి సొంతూరికి రావడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఆదివారం ఆర్మీ జవాన్ వినయ్‌ను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడారు. ఏజెన్సీ గ్రామాల నుంచి యువకులు ప్రభుత్వ పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి ఉద్యోగాలకు ఎంపికవ్వడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో కొప్పుల లక్ష్మణ్, రామనాథం, మాటూరి నర్సింహారావు, రాంపండు, నాగరాజు, కృష్ణ, ప్రభాకర్, చిరంజీవి, ప్రవీణ్, రాజు, కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.



జవాన్‌గా ఎంపికైన యువకుడు వినయ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

స్థానిక ఎన్నికల్లో ఏపార్టీతో పొత్తు లేదు

- టీడీపీ రాష్ట్ర నాయకుడు కేతినేని హరీష్ చంద్ర

తల్లాడ, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో ఏపార్టీతో టీడీపీ పొత్తు పెట్టుకోకుండా ఒంటరిగా పోటీచేస్తుందని టీడీపీ రాష్ట్ర నాయకుడు కేతినేని హరీష్ చం ద్ర అన్నారు. ఆదివారం స్థానిక కేతినేని థియేటర్‌లో పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు సరికొండ శ్రీనివాసరాజు అధ్యక్షతన జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌కు వ్యతిరేకంగా అనివార్యంగా కాంగ్రెస్ పార్టీకి టీడీపీ పార్టీ మద్దతు ఇవ్వడం జరిగిందన్నారు. మారిన రాజకీయ పరిస్థితుల దృష్ట్యా స్థానిక ఎన్నికల్లో అన్నిస్థానాల్లో టీడీపీ ఒంటరిగా పోటీచేస్తుందన్నారు. ఈసమావేశంలో ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ దూపాటి భద్రరాజు, మండల కార్యదర్శి వి.నాగేశ్వరరావు, తల్లాడ పట్టణ అధ్యక్షుడు మొక్క కృష్ణార్జున్, కొమ్మినేని రాము, నరసింహారావు, రామయ్య, మండేపుడి లక్ష్మయ్య, కొమ్మూరి అప్పారావు, పమ్మి వెంకటాచారి, బీరెడ్డి మల్లారెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ శాస్త్రవేత్త అశ్వనికి గుడి కట్టిన సోదరుడు



గుడిలో విగ్రహాలను ప్రారంభిస్తున్న తల్లి నేజి, అశోక్

- తండ్రి విగ్రహం కూడా ఏర్పాటు
- తల్లితో కలిసి ప్రారంభించి పూజలు చేసిన అశోక్
- గతేడాది వరదల్లో మృతి చెందిన తండ్రీకూతురు

కారేపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : జన్మనిచ్చిన తండ్రి, తోడబుట్టిన సోదరి గతేడాది వరదల్లో కన్నుమూశారు. ఏడాదిగా వారి జ్ఞాపకాలను మరువలేని ఆ యువకుడు తనకు జన్మనిచ్చిన తండ్రి, తోడబుట్టిన సోదరి ఆశయాలను కొనసాగించే క్రమంలో వారి జ్ఞాపకార్థంగా గుడిని నిర్మించాలని నిర్ణయించుకున్నాడు. అనుకున్నదే తడవుగా రూ.10లక్షలు వెచ్చించి గ్రామంలోని తమ వ్యవసాయ క్షేత్రంలో గుడి కట్టించి.. అందులో తండ్రి, సోదరి విగ్రహాలను ప్రతిష్ఠించాడు ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గంగారం తండాకు చెందిన నూనావత్ అశోక్. దీనికి సంబంధించిన వివరాలివీ.. గంగారం తండాకు చెందిన వ్యవసాయశాస్త్రవేత్త డాక్టర్ నూనావత్ అశ్విని, ఆమె తండ్రి నూనవత్ మోతిలాల్ గతేడాది ఆగస్టు31, సెప్టెంబరు 1న వచ్చిన భారీ వర్షం, వరదల సమయంలో కారులో హైదరాబాద్ వెళుతూ మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం వద్ద ఆకేరు వాగులో గల్లంతై మృతి చెందారు. దీంతో వారి జ్ఞాపకార్థం మోతిలాల్ కుమారుడు నూనవత్ అశోక్ గ్రామంలో వారిపేరు మీద గుడి కట్టించి.. ఆ ఆలయాన్ని తన తల్లి నేజితో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, స్థానికులు మాట్లాడుతూ దేశానికి ఎంతో సేవచేయాల్సిన తరుణంలో అశ్విని మృతిచెందడం బాధాకరమని, ఒకే ప్రమాదంతో తండ్రి, కూతురు మృతిచెందడం వారి కుటుంబానికి తీరని నష్టమని పేర్కొన్నారు. ఇక మోతిలాల్ కుమారుడు అశోక్ ప్రస్తుతం కామేపల్లి మండలంలో పంచాయత్‌రాజ్‌శాఖలో ఏఈగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇదిలా ఉండగా అశ్విని పేరును కొంతకాలం క్రితం ప్రభుత్వం కొత్తరకం వరి వంగడానికి పెట్టి గౌరవించింది.



గ్రామంలో నిర్మించిన గుడి

ఉమ్మడి జిల్లా బాక్సింగ్ క్రీడాకారుల ఎంపికలు



ఎంపికైన బాలికల జట్టు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం సీఈఆర్ క్లబ్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఉమ్మడి ఖమ్మం జిల్లాల బాక్సింగ్ ఎంపికలు ఆదివారం నిర్వహించినట్లు జిల్లా కార్యదర్శి వాసిరెడ్డి నరేష్‌కుమార్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలో అండర్-14, 17 బాలుర జట్లకు, అండర్-17 బాలికల జట్టుకు ఎంపిక చేసి ప్రకటించారు. వీరిలో అండర్-14 బాలుర విభాగంలో ఆర్.గణేష్(34-36 కేజీలు), కె.ధనుష్(36-38 కేజీలు), టి.మణికంఠ(28-30 కేజీలు), కె.పార్థు(38-40కేజీలు)వి.తనుష్ తేజేష(42-44కేజీలు), అబ్దుల్ హసన్(46-48 కేజీలు), వి.సాయి కిరణ్(48-50 కేజీలు)ఉన్నారు. అదేవిధంగా అండర్-17 బాలుర విభాగంలో కె.అరుణ్ కృష్ణ(54-57 కేజీలు), షేక్ అరహాన్ అలీ(46-48 కేజీలు), వి.భార్గవ్ తేజా(52-54 కేజీలు), సయ్యద్ అబ్దుల్ మాలిక్(57-60 కేజీలు) ఉన్నారు. అండర్-17 బాలికల విభాగంలో టి.హాసిని(46-48 కేజీలు), బి.రూప(52-54 కేజీలు), కె.హారిక (54-57 కేజీలు), బి.జాహ్నవి (57-60 కేజీలు), పి.ఖ్యాతి భువనశ్రీ(60-63 కేజీలు), కె.సానియా(63-66 కేజీలు) ఎంపికయ్యారు. ఈ నెల 10వ, 11వ, 12వ తేదీల్లో హనుమకొండలో జరిగే రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు తరుపున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఈ ఎంపికలకు భద్రాద్రి జిల్లా బాక్సింగ్ సెక్రటరీ మట్టపర్తి రమేష్, కోచ్ మట్టపర్తి మానస, శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ జిల్లా సభ్యులు భట్టు ప్రేమ్‌కుమార్, స్టెల్లా, కవిత, మంగీలాల్, వేణుగోపాల్, జేమ్స్, దీపక్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరాలి

- బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

ఖమ్మంబైపాస్‌రోడ్, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ తన బలాన్ని నిరూపించి, ప్రతి గ్రామంలో కాషాయజెండా ఎగరవేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో మండల, జిల్లా నాయకులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అంబదిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడం ప్రతి కార్యకర్త బాధ్యత, గ్రామాల అభివృద్ధి కేంద్ర నిధులతోనే సాధ్యమవుతుందన్నారు. ఆనిధుల విలువను ప్రజలకు తెలియచేయాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిగ్రామంలో బీజేపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. ప్రదాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో వార్డు సభ్యుల నుండి జడ్పీచైర్మన్ పదవి వరకు బీజేపీ ఆధిపత్యం సాధించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు బీజేపీ పోటీచేస్తుందని తెలిపారు. ఈసమావేశంలో బీజేపీ నాయకులు గంటేల విద్యాసాగర్, సన్నెఉదయ్‌ప్రతాప్, మందడపు సుబ్బారావు, నున్న రవికుమార్, పుల్లారావుయాదవ్, డాక్టర్ శీలం పాపారావు, నంబూరి రామలింగేశ్వరరావు, వీరెల్లి రాజేష్ పాల్గొన్నారు.

రోడ్లు నిర్మించాలంటూ రైతుల నిరసన

తల్లాడ, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): వాగుపై వంతెన, డొంక రోడ్లు నిర్మించాలంటూ రైతులు నిరసన చేపట్టారు. సమస్య పరిష్కరించకుంటే త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తామంటూ ఖమ్మంజిల్లా తల్లాడ మండలం మల్లవరం గ్రామానికి చెందిన రైతులు తెలిపారు. ఆదివారం మల్లవరంలోని ఊటవాగు వద్ద రైతులు నిరసన చేపట్టారు. మల్లవరం గ్రామానికి చెందిన పంటపొలాలకు వెళ్లేబాడవ, పాడిచేలల డొంక రహదారులు వర్షాల వల్ల మోకాలిలోతు గుంతలు బురదతో కనీసం నడవడానికి వీలులేకుండా ఉన్నాయి. వాగు దాటేందక రైతులు కూలీలు, పశువులు నరకయాతనపడుతున్నారు. ఈదశలో ఊటవాగుపై వంతెన, డొంకరోడ్లు నిర్మించాలని కోరుతూ ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు పలు మార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో రైతులు నిరసన కార్యక్రమం చేపట్టారు ఊటవాగు వరదనీటిలో రైతులు నిలబడి బ్యానర్, ఫ్లకార్డులు చేతబట్టి నినాదాలు చేశారు. ఊటవాగుపై వంతెన, డొంకరోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. లేకపోతే స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తామని తెలిపారు.



ఊటవాగులో నిరసన తెలుపుతున్న రైతులు

ఉద్యమ గుమ్మం నుంచే రణ నినాదం

(3వ పేజీ తరువాయి)

ముగింపు సభను విజయవంతం చేసేలా కృషిచేయాలని కోరారు. ఆర్‌ఎస్‌ఎస్ స్వార్థంతో అధికారమే లక్ష్యంగా పనిచేస్తోందని, ప్రజలను ఐక్యం చేస్తేంటే ఆర్‌ఎస్‌ఎస్ విచ్ఛిన్నం చేస్తోందని ఆరోపించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ ఉద్యమ గుమ్మం ఖమ్మంలో శతవసంత ముగింపు సభ జరగడం గొప్ప విశేషమన్నారు. కమ్యూనిస్టులు ఒక సైద్ధాంతిక నిర్మాణంలో రాజకీయ లక్ష్యం కోసం పనిచేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో సీపీఐ సీనియర్ నేత పువ్వాడ నాగేశ్వరరావు, జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, జాతీయ కార్యవర్గసభ్యుడు పీఎన్ మూర్తి, సీపీఐ రాష్ట్ర నాయకులు సలీం, బాగం హేమంతరావు, ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కూనంనేని

ఎన్నికల్లో లబ్ధి కోసమే బీజేపీ జీఎస్టీ బొనాంజా : నారాయణ

దేశంలో త్వరలో జరగబోతున్న పలు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బీజేపీ జీఎస్టీ తగ్గింపు బోనాంజాను ప్రకటించిందని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె నారాయణ ఆరోపించారు. బిహార్ సహా పలు రాష్ట్రాల్లో ఎన్నికల్లో గెలిచేందకు బీజేపీ రూ.వేలకోట్ల డంప్‌ను సిద్ధం చేసిందన్నారు. ఖమ్మంలో ఆదివారం జరిగిన సీపీఐ రాష్ట్ర సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అప్రజాస్వామిక విధానాల పట్ల ప్రజలు నిరసిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు దండి సురేష్, పల్లా వెంకటరెడ్డి, అజీజ్‌పాషా, చాడా వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జాతీయ కార్యదర్శిగా ఎన్నికైన పల్లా వెంకటరెడ్డికి సీపీఐ ఖమ్మం జిల్లా సమితి ఘనంగా సత్కరించింది.

ఆదాయం అదుర్స్!

(3వ పేజీ తరువాయి)

నివేదికలో పేర్కొన్నారు. 27 ఇసుక క్వారీలు నడుస్తుండగా.. వాటిలో 2.85కోట్ల మెట్రిక్ టన్నుల ఇసుకను తవ్వుకునేందుకు అనుమతులిచ్చారు. ఇప్పటివరకు కేవలం 37.05లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే తవ్వకాలు జరిగినట్లు తెలిపారు. వీటితోపాటు పినపాక, మణుగూరు, బూర్గంపాడు మండలాల్లోని పలు పట్టా భూముల్లో 15 అనుమతులు ఇవ్వగా.. 4,80,370 మెట్రిక్ టన్నులు తవ్వుకునేందుకు అనుమతులు ఉన్నట్లు తెలిపారు. ఇక మన ఇసుక వాహనం (శాండ్ టాక్సీ) కోసం చాతకొండ, సాటివారిగూడెం, సొంపల్లి, బూర్గంపాడు, దొంతలబోర, గారల్ల, నారాయణపురం, ముత్తాపురం, రాయపాడు, బయ్యారం, కేశావాపురం ప్రాంతాల్లో 1,10,014 క్యూబిక్ మీటర్లలో ఇసుక తవ్వకాలు జరపొచ్చన్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం కంటే జీరోదందా సాగించి అక్రమార్కులు పొందిన ఆదాయమే ఎక్కువ అన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో ఉన్న లీజు అనుమతులు గిరిజనుల పేరిట ఉండగా.. వారికి ఎంతోకొంత ముట్టజెప్పి గిరిజేనేతరులు అందినకాడికి దండుకోవడం పరిపాటేనన్న ఆరోపణలకు కొదవే లేదు. కాగా జిల్లా అధికారులు పొందుపరిచిన నివేదికలపై ఎన్ని అభ్యంతరాలు వెలువడతాయో వేచి చూడాల్సిందే.

వ్యక్తి పై దాడి

ఖమ్మం క్రైం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : బీర్ బాటిల్‌తో ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై ఖానాపూరం హవేలీ పోలీస్ స్టేషన్ నందు ఆదివారం రాత్రి కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందిరానగర్‌కు చెందిన సైదులుకు అదే ప్రాంతానికి చెందిన శివకు కొంతకాలంగా గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పాత కక్షలు దృష్టిలో పెట్టుకొని శివ అదే ప్రాంతానికి చెందిన సైదులు పై బీర్ బాటిల్ దాడి చేసి గాయపరిచాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై ఆటో డ్రైవర్ ఆత్మహత్య

ఖమ్మం క్రైం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై ఆటో డ్రైవర్ ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ నందు ఆదివారం కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సారథినగర్‌లో నివసించే మాదాసు సాయి తేజ (19) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సదరు యువకుని తండ్రి ఓ హత్య కేసులో జీవిత ఖైదు శిక్ష పడడంతో తల్లి వదిలేసి వెళ్లిపోయింది. దీంతో సాయి తేజ ఖమ్మంలోనే నివాసం ఉంటున్నాడు. శనివారం రాత్రి జరిగీన అమ్మవారి శోభాయాత్రలో సాయి తేజ పాల్గొని అర్ధరాత్రి సమయంలో తన ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో అతని పెద్దమ్మ వచ్చి చూడగా ఉరివేసుకొని కనిపించాడు. దీంతో పెద్దమ్మ కవిత ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నోడల్ అధికారుల నియామకం

- ఆరుచోట్ల ఓట్ల లెక్కింపు

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : త్వరలో నిర్వహించనున్న జిల్లా పరిషత్, మండలపరిషత్ ఎన్నికలకు వివిధ విభాగాల్లో సేవలను అందించడానికి వీలుగా 13మంది నోడల్ అధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. వారంతా వారికి కేటాయించిన విభాగాల్లో పోలింగ్ నిర్వహణకు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

జడ్పీటీసీ, మండల పరిషత్ ఎన్నికలకు ఈ సారి జిల్లా అధికారులు ప్రత్యేకంగా రిసెప్షన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. అన్ని మండల కేంద్రాల నుంచి పోలింగ్‌కు ముందు రోజున అధికారులు పోలింగ్ సామాగ్రిని సిబ్బందికి పంపిణీ చేస్తారు.

ఖమ్మం జిల్లా నోడల్ అధికారులు వీరే

పేరు	నిర్వర్తించే విభాగం
కొండపల్లి శ్రీరాం	మాన్‌పవర్ మేనేజ్‌మెంట్
సునీల్‌రెడ్డి	మాన్‌పవర్ మేనేజ్‌మెంట్
ఆర్.ఆశాలత	బ్యాలెట్ బాక్సుల నిర్వహణ
వి.వెంకటరమణ	రవాణా సౌకర్యం
కె.శ్రీరాం	శిక్షణ అధికారి
కె.నాగపద్మజ	ఎన్నికల సామాగ్రి పంపిణీ
రాజేశ్వరి, పుల్లయ్య	బాలెట్ పత్రాల ముద్రణ
ఆర్ సన్యాసయ్య	ఎంసీసీ, ఎక్స్‌పెండీచర్
గంగాధర్	ఎక్స్‌పెండీచర్
ఆర్ జయశ్రీ	అబ్జర్వర్స్
ఎంఏ గౌస్	మీడియా కమ్యునికేషన్
ఏ పద్మశ్రీ	హెల్ప్‌లైన్, ఫిర్యాదుల విభాగం, పోస్టల్ బ్యాలెట్
శ్రీనివాస్	రిపోర్టులు, రిటర్న్లు పోల్ పర్సంటేజ్

'గోండు'కు అధికారిక భాషగా గుర్తింపు కోసం కృషి

- మధ్యప్రదేశ్ రాష్ట్ర మంత్రి సంపతీయ ఉయికే
- ముగిసిన పదో జాతీయ గోండు భాషా ప్రామాణిక డిక్షనరీ వర్క్‌షాపు



మాట్లాడుతున్న మధ్యప్రదేశ్ రాష్ట్ర మంత్రి సంపతీయ ఉయికే

భద్రాచలం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : గోండు(కోయ) బిడ్డగా అధికారికంగా గోండు భాష గుర్తింపునకు తప్పక కృషి చేస్తానని మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రజారోగ్య సంక్షేమ శాఖ మంత్రి సంపతీయ ఉయికే అన్నారు. అఖిల్ గోండ్వాన మహాసభ ఇండియా ద్వారా మధ్యప్రదేశ్ రాష్ట్ర విభాగం ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్‌లో జాతీయ గోండు, కోయభాష గుర్తింపు కోసం పదో జాతీయ గోండు ప్రామాణిక డిక్షనరీ వర్క్‌షాపు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం అక్కడ గోండు మహారాణి దుర్గావతి 501వ జయంత్యుత్సవాల ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సంపతీయ ఉయికే మాట్లాడుతూ రాష్ట్ర మంత్రిగానే కాదు కోయభాషకు ఎనిమిదో షెడ్యూల్ ప్రకారం అధికారికంగా గుర్తింపు కోసం గోండు సమాజం తరపున తప్పక కృషి చేస్తానని స్పష్టం చేశారు. గతంలో తాను రాజ్యసభకు ఎన్నికయ్యాక గోండు భాషలో ప్రమాణ స్వీకారం చేస్తానంటే భాషకు గుర్తింపు లేకపోవడంతో ప్రమాణ స్వీకారం చేయడం వీలుకాదని పేర్కొన్నప్పుడు తన మనసు ఆందోళనకు గురైందన్నారు. అదే విషయాన్ని కేంద్ర హోం మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అప్పటి ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు దృష్టికి కూడా తీసుకెళ్లానని తెలిపారు.

ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం గోండు భాషకు అధికారిక గుర్తింపు కోసం కృషి చేస్తున్నారని, గోండు-కోయభాష వర్క్‌షాపులు దేశవ్యాప్తంగా గోండు సమాజం ఉన్న ప్రతీ చోట నిర్వహించాలన్నారు. అనంతరం దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతినిధులు మంత్రి సంపతీయ ఉయికేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి గోండు(కోయభాష) గుర్తింపునకు కృషి చేస్తున్న కోఆర్డినేషన్ టీంకు భద్రాచలం ఏజెన్సీకి చెందిన మడివి నెహ్రూ సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు. ఈ సమావేశంలో గడమండ్ల జిల్లాపరిషత్ చైర్మన్ సంజయ్‌కుశ్రం, మాజీ శాసనసభ్యులు దేశ్‌సింగ్ సెయ్యం, శివరాజ్‌సింగ్ మారావితో పాటు తెలంగాణ నుంచి సిడం అజ్జు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

● కిక్కిరిసిన బస్టాండ్లు.. రైల్వేస్టేషన్..

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : బతుకమ్మ, దసరా పండుగ సెలవులు ముగియడంతో సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో ఆదివారం బస్టాండ్, రైల్వే స్టేషన్‌లు ప్రయాణికులతో రద్దీగా మారాయి. సెలవులు ముగిసిన నేపథ్యంలో తెలంగాణతో పాటు ఏపీ వాసులు కూడా తమ సొంతూళ్లకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. దీంతో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టీజీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపిస్తోంది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఖమ్మం నుంచి హైదరాబాద్, సూర్యాపేట, కోదాడ, భద్రాచలం తదితర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని ఆర్ఎం సరిరాం, డిపో మేనేజర్ శివప్రసాద్‌లు తెలిపారు. ఈ ప్రత్యేక బస్సుల్లో అదనంగా 50శాతం వరకు అదనపు ఛార్జీలు వసూలు చేయనున్నట్లు యాజమాన్యం స్పష్టం చేయడంతో ప్రయాణికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దసరా, దీపావళి పండుగల సందర్భంగా బస్సు, రైలు ప్రయాణాలు బాగా పెరిగాయి. నగరంలోని సిటీ బస్టాండ్, కొత్త బస్టాండ్‌లు ప్రయాణికులతో కిక్కిరిశాయి. ప్రయాణికులకు సరిపడా బస్సులను అందుబాటులో ఉంచినప్పటికీ కొందరు బస్టాండ్ ముందున్న ప్రైవేటు వాహనాలను ఆశ్రయిసున్నారు.


ప్రయాణికులతో సందడిగా ఖమ్మం బస్టాండ్

● గోదావరి తీరంలో నిమజ్జన సందడి

పలు ప్రాంతాల నుంచి వచ్చిన 350 అమ్మవారి విగ్రహాలు

భద్రాచలం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీదేవీ శరన్నవ రాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని భక్తులచే పూజలందుకున్న దుర్గాదేవీ విగ్రహాలను భద్రాచలం పవిత్ర గోదావరిలో నిమజ్జనం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి 350 వచ్చన విగ్రహాలను నిమజ్జనం చేశారు. భద్రాచలం సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ పర్యవేక్షణలో తహసీల్దార్ డి.వెంకటేశ్వర్లు, సీఐ నాగరాజు, ఎంవీఐ సంగం వెంకటపుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి సీహెచ్.శ్రీనివాసరావు, అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్‌తో పాటు ఇతర శాఖల అధికారులు ఈ కార్యక్రమం ప్రశాంతంగా సాగేందుకు సహకారం అందించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రక్షణగా ఎన్డీఆర్ఎఫ్ బృందం సేవలందించింది. విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ఐటీసీ క్రేన్‌ను అందించింది.


అమ్మవారి విగ్రహాల నిమజ్జనం నిర్వహిస్తున్న దృశ్యం

ఆధార్ సేవలపై సవరించిన ఛార్జీల వివరాలు ప్రదర్శించాలి

భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం కలెక్టర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యుఐడీఏఐ) ఆధార్ సేవలపై సవరించిన కొత్త చార్జీలను 2025 అక్టోబరు 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయని భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ప్రజలకు ఈ మార్పులపై పూర్తి అవగాహన కల్పించే విధంగా అన్ని ఆధార్ సేవా కేంద్రాల్లో కొత్త చార్జీల వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ఆధార్ అప్‌డేట్ కోసం రేట్లు ఇలా ఉన్నాయి. 5-7 ఏళ్ల పిల్లలకు ఒకసారి అప్‌డేట్ చేయడానికి ఫ్రీ, 15-17 ఏళ్ల వారి కోసం ఒకసారి ఫ్రీ, మిగితా సందర్భాల్లో రూ.125 అవుతుంది. డెమోగ్రాఫిక్ అప్‌డేట్ అంటే పేరు, లింగం, పుట్టిన తేదీ, చిరునామా, మొబైల్, ఈమెయిల్ వంటి వివరాలను మార్చడం, బయోమెట్రిక్ అప్‌డేట్‌తో పాటు చేస్తే ఫ్రీ, వేరుగా చేస్తే రూ.75, డాక్యుమెంట్ అప్‌డేట్ అంటే ఐడీ, చిరునామా డాక్యుమెంట్స్ సమర్పించడం వంటివి మై ఆధార్ పోర్టల్ ద్వారా చేస్తే ఫ్రీ, ఎన్‌రోల్మెంట్ సెంటర్ ద్వారా చేస్తే రూ.75 వసూలు చేస్తారు. హోమ్ ఎన్‌రోల్మెంట్ సర్వీస్ కోసం రూ.700, ఒకే చిరునామాకు బహుళ మంది తీసుకుంటే మొదటి వ్యక్తికి రూ.700 మిగితా వ్యక్తులకి రూ.350 ఛార్జీలు వసూలు చేస్తారు. ఆధార్ డౌన్‌లోడ్ చేసి ముద్రించుకోవడానికి రూ.40 చెల్లించవలసి ఉంటుందన్నారు. జిల్లా ప్రజలు ఆధార్ సంబంధిత సేవల కోసం అధికారిక సేవా కేంద్రాలు లేదా గుర్తింపు పొందిన సెంటర్లను మాత్రమే వినియోగించాలని కోరారు. ప్రజల్లో ఏ విధమైన అపోహలు లేకుండా సవరించిన చార్జీలపై విస్తృత ప్రచారం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.


మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

అశ్వాపురం అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అమెర్ధా కాలనీ గ్రామానికి చెందిన కరటూరి కిషోర్(38) మనస్థాపంతో ఇంట్లో పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై ఆదివారం అశ్వాపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్థాపానికి గురైన కిషోర్ శనివారం ఇంట్లో ఉన్న పురుగుల మందు సేవించాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించటంతో ఖమ్మంలో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీతారామ కాలువ డిజైన్ మార్పు చేయాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు రైతుల వినతి

దమ్మపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : సీతారామ కాలవ డిజైన్ మార్పు చేయాలని నాగుపల్లి గ్రామానికి చెందిన రైతులు గుండుగులపల్లిలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆదివారం కలిసి వినతి పత్రం అందజేసారు. సీతారామ కాలువ పంట పొలాల మధ్య నుంచి వెళ్ళటం వల్ల చిన్న, సన్నకారు రైతులకు నష్టం జరుగుతుందని కాలువ నిర్మాణాన్ని మార్పు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించి చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. పలు గ్రామాలకు చెందిన రైతులు ఆయనను కలిసి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేసారు. అనంతరం గండుగులపల్లి గ్రామానికి చెందిన కోటగిరి శ్రీలోల ఇటీవల మృతి చెందగా ఆ కుంటుంబ సభ్యులను తుమ్మల పరామర్శించి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట కొయ్యల అచ్యుతరావు, కాసాని నాగప్రసాదు, ఎర్రా వసంతరావు, మన్నెం అప్పారావు, బుజ్జిబాబు, కాసాని మంగేశ్వరరావు తదితరులు ఉన్నారు.


తుమ్మలకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఆయిల్‌పామ్ రైతులను ప్రోత్సహించాలి

మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత ప్రోత్సాహం అందించాలని, ఆయిల్‌పామ్ సాగు రైతుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంట రంగారెడ్డి తెలిపారు. ఆదివారం ఖమ్మంలో నిర్వహించిన తెలంగాణ ఆయిల్‌పామ్ రైతుల రాష్ట్ర సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆయిల్‌పామ్‌కు కనీస మద్దతు ధర టన్నుకు రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో పంపిణీ చేసిన ఆయిల్‌పామ్ మొక్కలు జన్యుపరమైన ఇబ్బందులు వచ్చి వాటికి గెలలు రాకపోవడంతో ఐదారు ఏళ్లు పెంచిన తర్వాత వాటిని తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడు తుందన్నారు. అలాంటి రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఆయిల్‌పామ్ రైతుల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రైతులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షు డు తుంబూరు మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ విదేశాల నుంచి మొక్కలను దిగుమతి చేయటం ద్వారా సమస్యలు ఏర్పడుతున్నాయని, స్థానికంగానే ఆయిల్‌పామ్ నర్సరీల్లో మొక్కలను జన్యుపరంగా పరిశీలించి పెంచాలని కోరారు.



మాట్లాడుతున్న జూలకంటి

తైక్వాండో క్రీడల్లో 20 మందికి బెల్ట్ గ్రేడ్ పరీక్షలు

అసోసియేషన్ ప్రెసిడెంట్ మక్బుల్


క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): తైక్వాండో క్రీడల్లో 20మంది చిన్నారులకు బెల్ట్ గ్రేడ్ పరీక్షలు నిర్వహించినట్లు భద్రాద్రి జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎండీ.మక్బుల్ హుస్సేన్ ఆదివారం తెలిపారు. జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తగూడెం సీఈఆర్ క్లబ్ నందు బెల్ట్ గ్రేడ్ పరీక్షలు నిర్వహించగా 20మంది చిన్నారులు పాల్గొని ఉత్తీర్ణత సాధించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా తైక్వాండో క్రీడను ఆదరిస్తున్నందుకు జిల్లా కోచ్ ఎల్.రమేష్‌కు మార్ హర్షం వ్యక్తం చేశారు. సీనియర్ తైక్వాండో శిక్షకులు మల్లేశ్వరరావు, ఎస్‌కే.యాకూబ్‌పాషా, ఆర్.రమేష్, ఆర్గనైజ్ సెక్రటరీ టి.రవికిరణ్‌లు పాల్గొన్నారు. రాబోయే ఎస్‌జీఎఫ్ తైక్వాండో రాష్ట్రస్థాయి ఎంపికల్లో గ్రేడ్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన భద్రాద్రి జిల్లా క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

ఖమ్మం జిల్లాలో ముగ్గురు ఉపాధ్యాయులకు అంతర్జాతీయ పురస్కారం

ఖమ్మం ఖానాపురం హవేలీ/కల్లూరు, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించింది. ఆదివారం కరీంనగర్‌లో జరిగిన అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఖమ్మం జిల్లా ముదిగొండ జడ్పీహెచ్‌ఎస్‌కి చెందిన అవధానుల మురళీకృష్ణకు గణితశాస్త్రంలో, పేరువంచ జడ్పీహెచ్‌ఎస్‌లో ఎస్ఏగా పనిచేస్తున్న ఎండీ మౌలాలికి, కామంచికల్ జడ్పీహెచ్‌ఎస్‌లో క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు జిందం రఘుకుమార్‌కి పీపుల్ హెల్పింగ్ హాండ్స్ ట్రస్టు, కవులు, కళాకారులు, రచయితల సంఘాల వేదిక అధ్యక్షుడు గంగారపు మల్లేశం, డాక్టర్ కే.రామకృష్ణ, ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.అంజయ్య, జాతీయ జీపీస్పీ కోశాధికారి సుమలత చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందజేశారు. జిల్లాలో ముగ్గురు ఉపాధ్యాయులు అవార్డులు అందుకున్న సందర్భంగా పలువురు ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.


అవార్డు అందుకుంటున్న మురళీకృష్ణ

ఇల్లెందు ఏరియాలో పర్యటించిన డైరెక్టర్

ఇల్లెందు అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు ఏరియాలో డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) కె.వెంకటేశ్వర్లు ఆదివారం పర్యటించారు. ఇల్లెందు ఏరియా జీఎం వి.కృష్ణయ్యతో కలిసి కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన జేకే ఓసీని త్వరలో ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, దానికి ఉన్న అడ్డంకులు తొలగించడానికి కావల్సిన పనులను అందించడానికి సింగరేణి అధికారులు, ఉద్యోగులు, యూనియన్ నాయకులు, పట్టణ ప్రజలందరూ సహకరించి నూతన ఓసీ ప్రారంభానికి, అలాగే ఇల్లెందు మనుగడకు సహకరించాలన్నారు. అనంతరం ఏరియా ఆస్పత్రిని సందర్శించి కార్మికులకు వైద్యం ఎలా జరుగుతుందని ఆరా తీశారు. నిరంతరం ఉద్యోగులకి వైద్యులు అందుబాటులో ఉండాలని, స్నేహపూర్వకంగా వారితో మాట్లాడాలని సూచించారు. ఈ సందర్భంగా బొగ్గుఉత్పత్తి రవాణాకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బొగ్గు నాణ్యత సామర్థ్యం, నాణ్యతతో బొగ్గుఉత్పత్తి అయ్యేలాగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం డి.రామస్వామి, ఏరియా ఇంజనీర్ ఆర్వీ నరసింహరాజు, ఏజీఎం ఐఈడీ గిరిధర్‌రావు, ఏరియా సేఫ్టీఆఫీసర్ జాకీర్‌హుసేన్, డీజీఎం పర్సనల్ అజీర తుకారాం, రామూర్తి, శివ, వీరకుమార్, శివప్రసాద్, సతీష్‌కుమార్, వెంకటేశం, రత్నం, నాగేశ్వరరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.


సింగరేణి వైద్యశాలను పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు

ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి యత్నం

ములకలపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ములకలపల్లి మండల కేంద్రంలో ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి యత్నించిన ఘటన కలకలం రేపింది. ఎస్‌బీఐ ఏటీఎంలో శనివారం రాత్రి 11:30 ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి చోరీకి ప్రయత్నం చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోలీసులు రోజువారీ చేసే పెట్రోలింగ్ సమయంలో ఏటీఎంలో వెలుతురు లేదని ఏటీఎం దగ్గరికి వెళుతుండగా దొంగ గమనించి పారిపోయాడు. దీంతో పోలీసులు వెంబడించగా తప్పించుకున్నాడని తెలిపారు. ఈ విషయంపై ఎస్ఐ మధుప్రసాద్‌ను వివరణ కోరగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.


ఏటీఎంలోకి చొరబడిన అపరిచిత వ్యక్తి

మధిరలో ఓ ఇంట్లో చోరీ

మధిర రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలోని 21వ వార్డులో వెంపటి రాజేంద్ర ప్రసాద్ నివాసంలో చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం రాజేంద్ర ప్రసాద్ కుటుంబం దసరా పండుగకు ఖమ్మంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఆదివారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చారు. ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగులకొట్టి లోపలికి ప్రవేశించిన దొంగలు బీరువాను కూడా పగులకొట్టి 12గ్రాముల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. అలాగే ఇంట్లో ఉన్న నాలుగు బియ్యం బస్తాలు, ఇత్తడి కాగులు, రూ.పది వేల నగదు, దుస్తులను చోరీ చేసినట్లు గమనించారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు మధిర టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చింతకాని, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ముదిగొండ మండలం పెద్దమండవ మున్నేరు నుంచి ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎన్.వీరేందర్ తెలిపారు.

పాముకాటుకు మహిళ మృతి

ముదిగొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పాముకాటుతో ఓ మహిళ మృతి చెందిన ఘటన ఖమ్మంజిల్లా ముదిగొండ మండలం పమ్మి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జాలాది రాధ(43) ఓ రైతు పొలంలో పని చేసేందుకు వెళ్లగా పాముకాటుకు గురైంది. దీంతో ఆమె కేకలు వేయడంతో తోటి కూలీలు ఆమెను నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందింది. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్‌ఎస్‌పై మాజీ ఎమ్మెల్యే తాటి తిరుగుబాటు!

- జిల్లా అధ్యక్షుడు రేగా, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మెచ్చా వైఖరిపై మండిపాటు
- పార్టీని నాశనం చేస్తున్నారంటూ ఆగ్రహం..
- అధినాయకత్వానికి తెలిపినా పట్టించుకోవడం లేదని ఆవేదన
- నాయకులు, కార్యకర్తలకు విలువ ఇవ్వకపోతే మూల్యం తప్పదు
- ఒంటెత్తు పోకడ పోతే తిరుగుబాటు తప్పదని తాటి వెంకటేశ్వర్లు హెచ్చరికలు
- బీఆర్ఎస్ సమావేశాన్ని బహిష్కరించిన బీఆర్ఎస్ మండల ముఖ్యనాయకులు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు

అశ్వారావుపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, ట్రైకార్ మాజీ చైర్మన్ తాటి వెంకటేశ్వర్లు బీఆర్ఎస్‌పై తిరుగుబాటు బావుటా ఎగరవేశారు. బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, పార్టీ అశ్వారావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ మెచ్చా నాగేశ్వరరావు ఒంటెత్తు పోకడలతో పార్టీ సర్వనాశనమైపోతోందని, కార్యకర్తలను పట్టించుకునే వారే లేరని, కష్టపడిన కార్యకర్తలు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నారని, ఈ పద్ధతి మారక పోతే తిరుగుబాటు తప్పదంటూ ఆయన హెచ్చరించారు. ఆదివారం అశ్వారావుపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తాటి వెంకటేశ్వర్లు బీఆర్ఎస్ నేతల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నాయకులు పార్టీని తమ జేబు సంస్థలా భావించి ఒంటెత్తుపోకడలు పోతున్నారని, ఎన్నికల్లో ఓటమి తరువాత సమీక్షలు లేవని, సమావేశాలు లేవని, ఖాళీ అయిన మండల, గ్రామ కమిటీలను పూర్తిచేయలేదని విమర్శించారు. తాజాగా పెట్టిన సమావేశాలు ఏదో మారుమూల తోటల్లో పెట్టుకొని తోట రాజకీయాలు చేస్తున్నారని, ముఖ్య నాయకులకు కూడా సమాచారం ఇవ్వకుండా అహంకార భావంతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మూడేళ్లుగా పార్టీలో సంస్థాగత ఎన్నికలు జరపడం లేదంటూ రాష్ట్ర నాయకత్వంపై కూడా మండిపడ్డారు. ఇక్కడ పరిస్థితులు అన్నింటిని కేసీఆర్, కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లామని, తాను ఎన్నికల సమయంలో పార్టీలో చేరేటప్పుడు తనకు గౌరవం తగ్గకుండా చూస్తామని హామీ ఇచ్చి కేటీఆర్ పార్టీలోకి ఆహ్వానించారని, తరువాత పట్టించుకోలేదని విమర్శించారు. 1981 నుంచి రాజకీయాలలో ఉండి రెండు సార్లు ఎమ్మెల్యేగా, ట్రైకార్ చైర్మన్‌గా పనిచేసిన తన లాంటి సీనియర్లకే దిక్కు లేకపోతే సామాన్యకార్యకర్తలకు అండగా ఎవరుంటారని ఆయన ప్రశ్నించారు. పార్టీ అధిష్ఠానానికి ఇక్కడ విషయాలు మరోసారి తీసుకెళుతున్నానని, రెండురోజుల్లో స్పందన లేక పోతే మరింత స్థాయిలో తిరుగుబావుటా తప్పదని, కార్యకర్తల కోసం ఏదైనా చేయడానికి సిద్ధమని ప్రకటించారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో పార్టీల కతీతంగా మంచి అభ్యర్థులు ఎవరు నిలబడితే వారికి మద్దతు ఇస్తామని, పార్టీని నమ్ముకున్న అభ్యర్థులు ముందుకొస్తే వారిని గెలిపించేందుకు వెనుకాడమని ఆయన హెచ్చరించారు. ఆదివారం తాటి చేసిన ఈ ప్రకటన జిల్లాలో రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది.

బీఆర్ఎస్ మండల సమావేశాన్ని బహిష్కరించిన ముఖ్యనేతలు

ఇదిలా ఉండగా అశ్వారావుపేట మండలంలో రెండు రోజుల క్రితం జరిగిన ఎన్నికల సన్నాహక సమావేశానికి మండలంలోని బీఆర్ఎస్ ముఖ్య నాయకులెవ్వరూ హాజరుకాకుండా సమావేశాన్ని బహిష్కరించడం చర్చనీయాంశంగా మారింది. నియోజకవర్గ ఇన్‌చార్జ్ మెచ్చా నాగేశ్వరరావు వైఖరికి నిరసనగానే ఆ సమావేశాన్ని బహిష్కరించినట్టు వారు చెబుతున్నారు. మూడేళ్లుగా ఖాళీగా ఉన్న మండల అధ్యక్ష పదవిని భర్తీ చేయలేకపోయారని, ఎన్నికల కోసం తొమ్మిది మందితో వేసిన సమన్వయ కమిటీ తూతూ మంత్రంగానే మిగిలిందని, వారితో సంబంధం లేకుండా ఓ వ్యక్తి చెప్పినట్టు ఏకపక్షంగా వ్యవహారాలు నడుపుతున్నారంటూ బీఆర్ఎస్ సీనియర్ నేతలు సంకా ప్రసాదరావు, తాడేపల్లి రవి, యుఎస్ ప్రకాశరావు, కే సీతారామస్వామి, జేకేవీ రమణారావు, కాసాని చంద్రమోహన్ లాంటి నేతలంతా ఆరోపిస్తూ సమావేశానికి దూరంగా ఉన్నారు. అంతేకాదు త్వరలోనే ముఖ్య నాయకులంతా మూకుమ్మడిగా ఇన్‌చార్జ్ వైఖరిపై అధిష్టానానికి ఫిర్యాదు చేసేందుకు రాజధానికి వెళుతున్నట్టు సమాచారం. తాము కష్టపడి నిర్మించుకున్న పార్టీలోకి వచ్చిన వ్యక్తులు పార్టీని కబళించే ప్రయత్నం చేస్తున్నారని, పార్టీని నాశనం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎన్నికల వేళ బీఆర్ఎస్ పార్టీలో జరుగుతున్న ఈ సంఘటనలు బీఆర్ఎస్ పార్టీలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఈ వివాదాలు మరో రెండు మూడు రోజుల్లో తీవ్రస్థాయికి చేరే అవకాశాలున్నట్టు పార్టీలోనే కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. మరోవైపు ఈ పరిణామాలు బీఆర్ఎస్ కార్యకర్తల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.

భద్రాద్రి జడ్పీ చైర్మన్ ఆదివాసీలకే ఇవ్వాలి

ఏజెన్సీలో గిరిజనేతర రిజర్వేషన్ నిలుపుదల చేయాలి


టీఏజేఎస్ జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య

భద్రాచలం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా జడ్పీ చైర్మన్ ఆదివాసీలకే ఇవ్వాలని, అలాగే ఏజెన్సీ ప్రాంతంలో స్థానిక ఎన్నికల్లో గిరిజనేతరుల రిజర్వేషన్ నిలుపుదల చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య డిమాండ్ చేశారు. భద్రాచలంలో ఆదివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన గిరిజనేతర రిజర్వేషన్‌లో 5వ షెడ్యూల్ ప్రాంతంలో మినహాయించాలని షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనేతరులకు అవకాశం ఇచ్చే రొటేషన్ పద్ధతి ఆపాలని అన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన జిల్లాపరిషత్ రిజర్వేషన్‌లో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఆదివాసీలు అధికంగా ఉన్న కొత్తగూడెం ఆదిలాబాద్, కొమరంభీం, మహబూబాద్ జిల్లాల్లో జనరల్ స్థానాలుగా ప్రకటించడం పూర్తిస్థాయిలో ఏజెన్సీ, ఆదివాసీలున్న మండలాల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను జనరల్, ఇతర వారికి రిజర్వు చేస్తూ ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించడం వల్ల రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్‌లో ఉన్న హక్కులను హరించినట్లేనని అన్నారు. ఈ సమావేశంలో సోయం జోగారావు, పాయం నరసింహారావు, కుంజా శ్రీను, సతీస్, పొడెం ప్రసాద్, హనుమంతరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పుల్లయ్య

వర్షానికి నేలవాలిన పత్తి పంట

● లబోదిబోమంటున్న రైతులు ● పరిహారం చెల్లించాలి : సీపీఎం


వెనకతండా ప్రాంతంలో నేలరాలిన పత్తిపంటను చూపిస్తున్న రైతు

జూలూరుపాడు, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం కురిసిన భారీ వర్షానికి బోజ్యాతండా పంచాయతీ పరిధిలో సాగు చేసిన పంట నేలరాలింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. పాపకొల్లు, వెనకతండా, బోజ్యాతండా గ్రామాలకు చెందిన రైతులు సాగుచేసిన పత్తి పంట ఈ వర్షానికి 100నుంచి 150ఎకరాల్లో దెబ్బతింది. రైతులు పంటను చూసి కన్నీంటి పర్యంతమయ్యారు. కొంతమంది రైతులు సాగుచేసిన పత్తి పంట నేలరాలగా, మరికొన్నిచోట్ల పంట వర్షానికి కొట్టుకుపోయింది. ఇప్పటికే ఎకరానికి రూ.30 నుంచి రూ.40వేల వరకు పెట్టుబడి పెట్టినప్పటికీ అకాల వర్షం నిండాముంచిందని వాపోతున్నారు. ఆదివారం సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేష్, నాయకులు దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలించారు. అధికారులు తక్షణమే పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులకు పరిహారం అందించేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు.

మధిర చెరువులో పడి యువకుడి మృతి

మధిర రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మధిర పెద్ద చెరువులో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం తునికిపాడు గ్రామానికి చెందిన ఇలవరపు వంశీ(20) ఆదివారం ఉదయం తన స్నేహితులతో కలిసి మధిర పెద్ద చెరువుకు ఈతకు వెళ్లారు. పూర్తి స్థాయిలో ఈత రాని వంశీ ప్యాంట్ ఉంచుకొనే చెరువులోకి ఈతకు దిగాడు. చెరువులోకి కొంతదూరం వెళ్లాక తడిచిన ప్యాంటు కావడంతో ఆయాసంతో ఒడ్డుకు చేరుకోలేక నీట మునిగాడు. నీటిలో మునిగిపోతున్న వంశీని సహచరులు గమనించి కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. చెరువులో నీటి లోతు ఎక్కువగా ఉండటంతో అంతంత మాత్రంగానే ఈత వచ్చిన వంశీ నీట మునిగిపోయాడు. ఈ సమాచారం తెలుసుకున్న మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ సభ్యులు నాలుగు గంటల పాటు శ్రమించి అతడి మృతదేహాన్ని వెలికి తీశారు. సంఘటన స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు వంశీ మృతదేహం చూసి బోరున విలపించారు. మృతుడు విజయవాడలో ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు చదువుతున్నాడు. మధిర పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి తల్లిదండ్రులు సంజీవరావు, మరియమ్మలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


వంశీ మృతదేహం

నీటిలో మునిగి ఒకరు..

మణుగూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పగిడేరు గ్రామపంచాయతీ శివారు ప్రాంతంలో ఉండే పేరంటాళ్ల చెరువులో మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం సాయంత్రం ఎస్టీ కాలనీలో నివాసముండే గురుమూర్తి, ఎం.సుధాకర్, బోడె చెరన్(25)లో సమీపంలో ఉన్న పేరంటాళ్ల చెరువులో చేపల వేటకు దిగారు. లోతు అంచనా తెలియక పోవడంతో చెరన్ చెరువులో కొంతదూరం వెళ్లేసరికి మునిగిపోయాడు. దీంతో గురుమూర్తి, సుధాకర్‌లు బయటికి వచ్చేశారు. బోడె చెరన్ నీళ్లలో మునిగి గల్లంతయ్యాడు. అతని కోసం గాలించగా దొరకలేదు. కానీ ఆదివారం అతని మృతదేహం చెరువులో లభ్యమైంది. పోలీసులు సమాచారం తెలుసుకుని సంఘటనా స్థలానికి చేరుకున్నారు. జరిగిన విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మృతుడు గత నాలుగేళ్ల క్రితం మంగపేట మండలం నర్సింహాసాగర్ నుంచి వచ్చి స్థానికంగా అత్తగారి ఇంటి వద్ద నివాసముంటున్నాడు. మృతినికి భార్య ఉంది. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

ఖమ్మంక్రైం,అక్టోబరు5(ఆంధ్రజ్యోతి):పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఖానాపురంహవేలి పోలీసుస్టేషన్ సీఐ భానుప్రకాష్ తిరిగి బాధితుడికి ఆదివారం అందించారు. నగరంలోని మామిళ్లగూడేనికి చెందిన ఎండీ ఖాజా ఇటీవల తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. బాధితుడి ఫిర్యాదుమేరకు ఐయంఈఐ నెంబర్ ద్వారా మొబైల్‌ను ట్రేస్‌చేశారు. బాధితుడికి అందించినట్టు సీఐ తెలిపారు.



ఫోన్ అందిస్తున్న సీఐ

ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి):నగరంలోని సారథినగర్‌లో ఆదివారం అయ్యప్పస్వామి మహాపడిపూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవాన్ని శ్రీనివాసనగర్‌అయ్యప్పస్వామి ఆలయ ప్రధాన తంత్రి నారాయణ నంబూద్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. పెద్దఎత్తున అయ్యప్ప స్వాములు,భక్తులు పాల్గొన్నారు. భజన పాటలు, భక్తిగీతాలు ఆలపించారు. స్వామికి పంచామృతాలతో అభిషేకం చేశారు.స్వాములకు అన్నప్రసాదం అందించారు.



పడిపూజ నిర్వహిస్తున్న నారాయణ నంబూద్రి

గొడవర్తి కుటుంబానికి మంత్రి తుమ్మల పరామర్శ

ఖమ్మంస్పోర్ట్స్,అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ప్రముఖ పత్తివ్యాపారి, రిటైర్డ్ టీచర్ గొడవర్తి రామారావు (పంతులుగారు) కుటుంబాన్ని ఆదివారం వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపరామర్శించారు. రామారావు చిత్రపటానికి నివాళులు అర్పించారు.అనంతరం ఆయన కుమారులు గొడవర్తి శ్రీనివాసరావు, నాగేశ్వరరావులను ఓదార్చారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు.కార్యక్రమంలో రాష్ట్రగిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు పలువురు నాయకులు ఉన్నారు.



రామారావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న తుమ్మల నాగేశ్వరరావు

జూపెడ- రఘునాథపాలెం

రహదారి అధ్వానం

తిరుమలాయపాలెం, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): మండలంలోని జూపెడనుంచి రఘునాథపాలెం వరకు రహదారి అధ్వాన్నంగా మారింది. ఇటీవల కురిసిన భారీవర్షాలతో రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ప్రయాణీకులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి నుంచి ప్రజలు వివిధ ప్రాంతాలకు రాకపోకలు కొనసాగిస్తున్నారు ద్విచక్రవాహనదారులు వెళ్లలేని పరిస్థితి. ఈవిషయమై ఆయా గ్రామాల ప్రజలు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. ఈరహదారిపై ప్రయాణిస్తుంటే నరకయాతన పడే పరిస్థితి. రఘునాథపాలెం వాసులు జూపెడ వెళ్లాలంటే కాకరవాయి మీదుగా అదనంగా ప్రయాణించాలి. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న రోడ్డు

లక్ష పెట్టు.. జవాన్ గిరి పట్టు

- కేఎంసీలో నియామకాల జోరు
- 4, 20, 21, 47 డివిజన్లలో పోస్టుల ఖాళీలు
- డివిజన్లు మార్చలేక పోతున్న అధికారులు



ఖమ్మంకార్పొరేషన్, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలో నెలరోజులుగా జవాన్‌ల నియామకం పైరవీల జోరు సాగుతోంది. అవసరమైతే రూ.1లక్షైనా ఇస్తామంటూ పారిశుధ్య కార్మికుల్లోని పలుకుబడిన కలిగిన వారు పైరవీలు చేస్తున్నారు. కేవలం నాల్గు డివిజన్లలో జవాన్ల కొరత ఉండగా నగరంలోని 60డివిజన్లలో ఉన్నకార్మికుల్లో కొందరు పోటీలు పడుతున్నారు. ఇటు కార్పొరేటర్లుతో పాటుగా అటు కార్మిక సంఘాల నాయకులతో వత్తిడి పెంచుతున్నారు. డివిజన్లలో పారిశుధ్య పనులను వదిలి జవాన్‌గిరి కోసం కేఎంసీ చుట్టూ కొంతమంది తిరుగుతున్నారు. కాగా జవాన్ల నియామకం ఇప్పుడు కార్పొరేటర్లుకు ప్రతిష్టాత్మకంగా మారింది. మరో ఆరునెలల్లో పదవీ కాలం ముగుస్తుండటంతో తమ అనుచరులను జవాన్లుగా నియామకం చేసేందుకు కొంతమంది కార్పొరేటర్లు అధికారులపై వత్తిడి పెంచుతున్నారు.

నాలుగు డివిజన్లలో ఖాళీలు

పారిశుధ్య కార్మికులుగా కనీసం ఏడేళ్ల నుంచి పదేళ్ల వరకు అనుభవం కలిగి విద్యార్హత ఉన్న వారిని పారిశుధ్య జవాన్‌గా గతంలో తీసుకునే వారు. కానీ ఇప్పుడు స్వచ్ఛతా భారత్ వంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాలు అమలు కావటంతో రాష్ట్రంలోని ఇతర మున్సిపాలిటీల్లో ఇంటర్ బైపీసీ కనీస అర్హత ఉండి శానిటరీ శిక్షణ విద్యాభ్యాసం చేసి ధ్రువపత్రాలు కలిగిన వారినే జవాన్లుగా నియమిస్తున్నారు. కానీ ఖమ్మం నగర పాలక సంస్థలో ఈ నిబంధనలు అమలు కావటం లేదు. ఇటీవల పారిశుధ్య పనులు నిర్వహించకుండా చికెన్ హోల్‌సెల్ వ్యాపారం చేసే పారిశుధ్య కార్మికుడికి ఇటీవల జవాన్ ఉద్యోగం ఇచ్చారు. ఆ వివాదం ముగియక ముందే ఇప్పుడు 4, 20, 21,47 డివిజన్లలో జవాన్ల ఖాళీలు నిపేందుకు అధికారులు కార్యచరణ చేశారు. విషయం తెలుసుకున్న పైరవీకారులు నెల రోజులుగా మేయర్ నుంచి డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ వరకు పైరవీలు చేస్తున్నారు.

డివిజన్లు మార్చలేక పోతున్న అధికారులు

పారిశుధ్యలోపంపై జాతీయ, రాష్ట్రస్థాయిలో అపఖ్యాతి ఖమ్మం నగర పాలక సంస్థకు వచ్చినా కనీసం డివిజన్లలో పనిచేస్తున్న జవాన్లను మార్చలేని పరిస్థితిలో ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు ఉన్నారు. గత ప్రభుత్వంలో పైరవీలతో కార్పొరేటర్లు వద్ద పనిచేసిన పారిశుధ్య కార్మికులు జవాన్లుగా ప్రమోషన్లు పొందారు. ప్రభుత్వం మారినా ఆయా జవాన్లును అధికారులు మార్చలేని పరిస్థితిలో ఉన్నారు. రాజకీయంగా పలుకుబడి కలిగిన జవాన్లు తాము డివిజన్లు మారే ప్రసక్తి లేదని పలుకుబడిని ఉపయోగిస్తున్నారంటే జవాన్లుకు రాజకీయ అండదండలు ఇట్టే తెలుస్తోంది.

జాతి వైరం మరిచిన కుక్క, పిల్లి



ఏన్కూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా ఏన్కూరులో ఓ వింత సంఘటన జరిగింది. సహజంగా కుక్క, పిల్లికి జాతి వైరం ఉంటుంది. కుక్క దాడి చేస్తుందనే భయంతో పిల్లిపారిపోతుంది. కానీ జన్నారం క్రాస్‌రోడ్డులో సిలివేరు సుబ్బారావు దుకాణంలో గత కొన్ని నెలల నుంచి పిల్లి కుక్కతో స్నేహం చేస్తోంది. కుక్క కూడా పిల్లి బాగోగులను చూస్తుంది. శరీరంపై పడుకోబెట్టుకుని పిల్లిని జాగ్రత్తగా చూస్తుంది. మనుషుల మధ్య వైషమ్యాలు ఉంటున్న నేటి సమాజంలో కుక్క, పిల్లి స్నేహం స్థానికులను ఆశ్చర్యపరుస్తోంది. స్థానికులు ఈ దృశ్యాన్ని ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఈ దృశ్యాలను ఆంధ్రజ్యోతి తన కెమేరాలో బంధించింది.

మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు

ఏన్కూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గుడ్ల వెంకటేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఆదివారం ఏన్కూరులో సంఘం గౌరవ అధ్యక్షుడు బస్వాంగి నాగేశ్వరరావు అధ్యక్షతన అసోసియేషన్ మండల మహాసభ ఆదివారం జరిగింది. ప్రధాన కార్యదర్శిగా పాలెపు పాపారావు, కోశాధికారిగా దొడ్డ శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులుగా జవ్వాజి శ్రీనివాసరావు, కొపెల రామారావు, షేక్ హుస్సేనుద్దీన్, షేక్ అన్వర్‌లను ఎన్నుకున్నారు. బి. మోహన్, బి.శ్రీనివాసరావు, వంశీకృష్ణ, షేక్‌పెంటు సాహెబ్, షేక్‌జానీ, తుమ్మపల్లి మధు, ఉపేందర్‌పాల్గొన్నారు.



ఆ ముగ్గురిలో ఎవరిని వరించునో ?

- కామేపల్లి జడ్పీటీసీ జనరల్ మహిళకు కేటాయింపు
- అధికార పార్టీ నుంచి ముగ్గురి పేర్లు సిఫారసు చేసిన నాయకులు



కామేపల్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మండలాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. కామేపల్లి మండలంలో 12ఎంపీటీసీ స్థానాలకు, జడ్పీటీసీ స్థానానికి రిజర్వేషన్‌ను ఇటీవల అధికారులు ఖరారు చేశారు. మండలంలో 41,955 మంది జనాభా ఉన్నారు. ఓటర్లు 35,539 మంది ఉన్నారు. వారిలో పురుష ఓటర్లు 17437, మహిళా ఓటర్లు 18102 మంది ఉన్నారు. రొటేషన్ పద్ధతిలో జడ్పీటీసీ జనరల్ మహిళకు రిజర్వేషన్ కేటయించారు. అయితే కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మండలానికి ముగ్గురు చొప్పున జడ్పీటీసీ ఆశావాహుల లిస్ట్ పంపించాలని ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగా మండల పార్టీ ముగ్గురు అభ్యర్థుల పేర్లు ఖరారు చేసినట్లు తెలిసింది. వారిలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏపూరి మహేందర్ సతీమణి అయిన మాజీ ఎంపీటీసీ సభ్యురాలు ఏపూరి హేమామాలిని, మాజీఎంపీటీసీ సభ్యుడు రాంరెడ్డి జగన్నాథరెడ్డి సతీమణి అయిన శ్రీలక్ష్మి, ప్రస్తుత కొండాయిగూడెం సొసైటీ చైర్మన్ ధనియాకుల హన్మంతరావు సతీమణి అయిన మాజీ ఎంపీటీసీ సభ్యురాలు ధనియాకుల బేబి పేర్లు ఖరారు చేసి పంపినట్లు సమాచారం. వీరు ముగ్గురు మండలంలో ప్రజాదారణ పొందిన నాయకులు కావడం విశేషం.కాంగ్రెస్ పార్టీ జడ్పీటీసీ స్థానం కైవసం చేసుకుంటే డిప్యూటీ చైర్మన్ పదవి వరించే అవకాశం ఉంది. ఖమ్మం జడ్పీ చైర్మన్ పదవి ఎస్టీ జనరల్ కేటాయించిన విషయం తెలిసిందే.. ఒకవేళా డిప్యూటీ చైర్మన్ పదవి జనరల్ మహిళకు కేటయించాల్సి వస్తే పక్కా కామేపల్లికి ఈపదవి వరిస్తుందని పార్టీ నాయకులు చర్చించుకుంటున్నారు.

కానిస్టేబుల్ కుటుంబంపై దాడి

- కారును అడ్డగించి మహిళలపైనా దౌర్జన్యం

చింతకాని, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులోని శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి దైవ దర్శనానికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న ఓ కానిస్టేబుల్ కుటుంబంపై చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన కొంత మంది పోకిరీ యువకులు నాగులవంచ ప్రధాన సెంటర్‌లో దాడి చేసి గాయపర్చారు. నేలకొండపల్లి మండలం బోదులబండ గ్రామానికి చెందిన కట్టికోల శ్రీనివాస్ ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం కుటుంబ సభ్యులతో కలసి పెనుగంచిప్రోలు శ్రీ లక్ష్మీతిరుపతమ్మతల్లి దర్శనానికి వెళ్లాడు. అనంతరం సాయంత్రం ఖమ్మంలోని ఇంటికి తిరుగుప్రయాణమయ్యారు. ఇంటికి వస్తున్న క్రమంలో దారిలో మక్కపేట వద్ద పాతర్లపాడు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై కారును వెంబడించారు. పలు మార్లు కారును ఓవర్‌టేక్ చేస్తూ భయభ్రాంతులకు గురిచేశారు. వత్సవాయి వద్ద కారు నిలిపి ప్రశ్నించిన కానిస్టేబుల్‌తో దుర్భాషలాడారు. కానిస్టేబుల్ కారులో కుటుంబ సభ్యులు మహిళలు, చిన్న పిల్లలు ఉండడంతో 100కు డయల్ చేసి సమాచారం ఇచ్చాడు. 100 నుంచి కాల్ రావడంతో బోనకల్ పోలీసులు అప్రమత్తమయ్యారు. రోడ్డుపై కాపు కాచి యువకులను పట్టుకునేందుకు ప్రయత్నించారు. పోలీసులను గమనించిన యువకులు అక్కడ నుంచి తప్పించుకుని కారు కంటే ముందుగా నాగులవంచ గ్రామం చేరుకున్నారు. ఇద్దరు యువకులు పాతర్లపాడు గ్రామం నుంచి మరికొంతమంది యువకులను పిలుపించుకుని నాగులవంచ గ్రామ ప్రధాన కూడలిలో ఖమ్మం- బోనకల్ రహదారిపై కానిస్టేబుల్ కారును గుర్తించి అడ్డుకున్నారు. కారులో నుంచి కానిస్టేబుల్‌తో పాటు కుటుంబ సభ్యులైన మహిళలను బయటకు లాగి దాడి చేయడమే కాకుండా మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కెల్లారు. దీంతో రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ వీరేందర్ సిబ్బందితో వెళ్లి ఘటనకు సంబంధించి ప్రాథమిక వివరాలు సేకరించారు. కానిస్టేబుల్ శ్రీనివాస్ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు వారి కోసం గాలిస్తున్నారు.

శ్రీ మృత్యుంజయస్వామికి అన్నాభిషేకం

సత్తుపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కల్పతరువు రోడ్డులోని శ్రీ విశ్వజ్ఞాన పీఠం 8వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం చండీహోమం, శ్రీ మృత్యుంజయస్వామికి అన్నాభిషేకం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేద పండితులు రవిశాస్త్రి గురుస్వామి ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల నడుమ డప్పువాయిద్యాలు మేళతాళాల మధ్య శ్రీ లలితాదేవి అమ్మవారికి చీరె, సారెలను ఊరేగింపుగా తెచ్చి సమర్పించారు. ఈ సందర్భంగా ఆయుధపూజ అనంతరం 11రోజుల పాటు లలితాదేవి దీక్షలు చేపట్టిన భక్తులు మాలధారణ విరమించగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్.విశ్వనాథరెడ్డి, ఎస్.గణేష్‌రెడ్డి, రమేష్, కృష్ణార్జునరావు, చింతకాయల దివ్య, స్రవంతి, నాగేశ్వరరావు, రాంబాబు, ఎం.చంద్రశేఖర్, డీ.నారాయణ, బ్రహ్మం పాల్గొన్నారు.



అమ్మవారి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వైద్య శిబిరం విజయవంతం

బోనకల్, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): బోనకల్‌లో ఆదివారం బత్తినేని చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. బీపీ, షుగర్ వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు మాట్లాడుతూ.. అమరజీవి కామ్రేడ్ తూము ప్రకాశరావు ఆశయ సాధన కోసం ఆయన మనవళ్లు బత్తినేని ట్రస్టును స్థాపించి పేదల కోసం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారని తెలిపారు.

పుష్కరకాలం కిందటే రిజర్వేషన్ పదనిసలు!

- ఐదేళ్లూ ఉపసర్పంచ్‌తోనే నడిచిన ఖానాపురం పంచాయతీ



పంచాయతీ కార్యాలయం



వైరా, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లలో చోటుచేసుకున్న చిత్రవిచిత్రాలు తక్కువేమీ కాదు. పుష్కరకాలం కిందటే వైరా మండలంలోని ఖానాపురం గ్రామంలో కూడా రిజర్వేషన్‌లో పదనిసలు చోటుచేసుకుంది. ఫలితంగా ఉపసర్పంచే ఐదు సంవత్సరాల పాటు సర్పంచ్ బాధ్యతలు నిర్వహించారు. జనాభా లెక్కల్లో భార్యభర్తలు మాత్రమే ఎస్సీలుగా ఉండి ఓటుహక్కు లేకపోయినప్పటికీ ఆ పంచాయతీ ఎన్నికల్లో ఖానాపురాన్ని ఎస్సీకి రిజర్వు అయింది. ఈ రిజర్వేషన్ ప్రకారమే ఎన్నికలు నిర్వహించారు. కేవలం 8వార్డులకు మాత్రమే రిజర్వేషన్ ప్రకారం ఎన్నికలు జరిగాయి. సర్పంచ్ పదవికి పోటీచేసేందుకు ఎస్సీ సామాజిక వర్గం నుంచి ఎవరూ లేకపోవడంతో ఆ ఎన్నిక జరుగలేదు. దాంతో 2013నుంచి 2018వరకు ఐదు సంవత్సరాలు ఖానాపురం ఉపసర్పంచ్ మారబోయిన ఏడుకొండలు సర్పంచ్ బాధ్యతలు నిర్వహించారు.

ఖానాపురానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న గన్నవరం గ్రామానికి చెందిన కోట ప్రసాద్, మరియమ్మ దంపతులు ఖానాపురంలో ఒక బడ్డీ కొట్టు పెట్టుకొని జీవనం కోసం చిరువ్యాపారం చేసుకునేవారు. ప్రతిరోజూ తమ గ్రామం నుంచి ఖానాపురం వచ్చి ఇంటికి వెళ్లేవారు. 2011లో జరిగిన జనాభా లెక్కల సమయంలో కోట ప్రసాద్ దంపతులు ఖానాపురం జనాభా లెక్కల్లో తమ పేర్లు రాయించుకున్నారు. అయితే ఆ ఇద్దరి ఓట్లు తమ స్వగ్రామంలోనే ఉండిపోయాయి. ఓట్లను ఖానాపురానికి మార్చుకోలేదు. జనాభా లెక్కల్లో కేవలం భార్యభర్తలు ఎస్సీలుగా ఉండటంతో 2013 ఎన్నికల్లో ఖానాపురం పంచాయతీని ఆ సామాజిక వర్గానికి రిజర్వు చేశారు. ఆ సమయంలో గన్నవరంలో ఉన్న తమ ఓట్లను ఖానాపురానికి మార్పించుకునేందుకు ప్రసాద్, మరియమ్మ ప్రయత్నించినప్పటికీ సాధ్యపడలేదు. చివరికి సర్పంచ్ ఎన్నిక లేకుండా 8వార్డులకు మాత్రమే ఎన్నికలు జరిగాయి. ఎన్నికైన వార్డుమెంబర్లలో మారబోయిన ఏడుకొండలుకు ఉపసర్పంచ్ పదవి దక్కింది. ఆయనే సర్పంచ్ విధులు నిర్వహించారు. ఆ ఐదేళ్ల కాలంలో సర్పంచ్ పదవికి ఎన్నికల నిర్వహణ కోసం ప్రభుత్వం నాలుగైదుసార్లు నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ ఎస్సీ సామాజిక వర్గం ఓటర్లు లేకపోవడంతో ఎన్నిక నోటిఫికేషన్‌కే పరిమితమైంది. ప్రస్తుతం వెలువడిన ఎన్నికల షెడ్యూల్‌లో ఖానాపురంకు ఎస్సీకి రిజర్వు అయింది.

‘శ్రీ చైతన్య’లో పల్లవికి ఘన సన్మానం



పల్లవిని సన్మానిస్తున్న కళాశాల చైర్మన్, డైరెక్టర్లు

ఖమ్మంరూరల్, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ నుంచి అవార్డు అందుకున్న శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని పల్లవిని శ్రీచైతన్య కళాశాలలో యాజమాన్యం ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ పల్లవి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ విభాగంలో ఆల్‌ఇండియా ట్రేడ్ టాపర్‌గా ఎంపికకావటం అభినందనీయమన్నారు. దేశస్థాయిలో అవార్డును స్వీకరించడం కళాశాలకు గర్వకారణంగా ఉందన్నారు. డైరెక్టర్లు డాక్టర్ సాయిగీతిక శ్రీవిద్య మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కొత్త సాంకేతికతను నేర్చుకుంటూ ముందుకు సాగితే అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రతిభ చాటగలరని దీనికి నిదర్శనం పల్లవి అన్నారు. ఈ సందర్భంగా పల్లవి తల్లిదండ్రులు తాళ్ళూరి రవి, అజితాలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, అకాడమి డీన్ వి.సుదర్శన్, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ రాజేష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి, కృష్ణ ప్రసాద్, ఏజీఎం.బ్రహ్మం, చిరంజీవి, ప్రణతి,జ్యోతి, కుమార్ పాల్గొన్నారు.

ఫోన్‌లో అభినందించిన మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

తాళ్లూరి పల్లవిని హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆదివారం ఫోన్‌లో అభినందించారు. పల్లవితో దత్తాత్రేయ ఫోన్‌లో మాట్లాడారు. భవిష్యత్తులో మంచి ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని సూచించారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఓ అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఐదు రోజుల క్రితం ఖమ్మంరూరల్ పోలీస్ పరిధి బైపాస్‌రోడ్‌లోగుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. మృతదేహాన్ని పోలీసు నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు.ఇప్పటివరకు మృతదేహం కోసం ఎవరూ రాకపోవటంతో అన్నంఫౌండేషన్ ఆధ్వర్యంలో బల్లేపల్లి వైకుంఠధమంలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఆటోయూనియన్ నూతన కమిటీ ఎన్నిక

తిరుమలాయపాలెం, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): ఖమ్మం టు కాకరవాయి ఆటోయూనియన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం మండలంలోని బచ్చోడులో ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా చీకటి వెంకన్న, ఏ.శ్రీనుతోపాటు మరో పదిమందితో కమిటీ ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యలకనరసయ్య,వీరమల్లయ్య, మల్సూర్, రవి, పవన్, మధు పాల్గొన్నారు.

బేతుపల్లిలో మిషన్ భగీరథ నీరు వృథా

- నీటి తాకిడితో నేలకొరిగిన వరిపైరు

సత్తుపల్లిరూరల్, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించే మిషన్ భగీరథ నీరు కాస్తా పైప్‌లైన్‌లో ప్రమాదం సంభవించడంతో నీరు వృథాగా పారుతూ వరి పంటకు నష్టం వాటిల్లిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని బేతుపల్లిలోని నల్లవాగు సమీపంలోని చెన్ను చంద్రయ్య అనే రైతుకు చెందిన వరి పొలం కోతకు రాగా మిషన్ భగీరథ పైప్‌లైన్ ప్రమాదవశత్తు పగిలిపోగ నీరు లీకవ్వడంతో పంట కాస్తా నేలకొరిగింది. ఈ లీకేజీ వల్ల నీటి వృథా జరగడమే కాకుండా స్థానిక ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని, ఎప్పుడు ఇలాంటి ప్రమాదభరిత సంఘటన జరిగిన తాత్కాలిక మరమ్మతుల చేస్తున్నారు. శాశ్వతంగా పరిష్కరించకపోవడంతో ఇలాంటి సమస్యలు ఎదురవుతున్నాయని, న్యాయం చేయాలని బాధితరైతు కోరుతున్నాడు.




నీళ్లు పారడంతో నేలకొరిన వరిపంట, పైపులైన్ వద్ద నుంచి లీకవుతున్న నీరు

కలిసొచ్చే పార్టీలతో ఎన్నికల సర్దుబాటు

వైరా, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సీపీఎంతో ఎన్నికల్లో కలిసొచ్చే పార్టీలతో సర్దుబాటు చేసుకుంటామని అందువల్ల సీపీఎం అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు కృషిచేయాలని ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం పిలుపునిచ్చారు. ఆదివారం వైరాలో మాజీ సర్పంచ్ పారుపల్లి కృష్ణారావు అధ్యక్షతన జరిగిన విప్పలమడక, లింగన్నపాలెం సీపీఎం గ్రామశాఖ సభ్యుల సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు, విప్పలమడక, లింగన్నపాలెం మాజీ సర్పంచ్‌లు తుమ్మల జాన్‌పాపయ్య, బాణాల వెంకట్రావమ్మ, నాగేశ్వరరావు, సుధాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భూక్యా వీరభద్రం

పుష్కరకాలం కిందటే రిజర్వేషన్ పదనిసలు!

» ఐదేళ్లూ ఉపసర్పంచ్‌తోనే నడిచిన ఖానాపురం పంచాయతీ

వైరా, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లలో చోటుచేసుకున్న చిత్రవిచిత్రాలు తక్కువేమీ కాదు. పుష్కరకాలం కిందటే వైరా మండలంలోని ఖానాపురం గ్రామంలో కూడా రిజర్వేషన్‌లో పదనిసలు చోటుచేసుకుంది. ఫలితంగా ఉపసర్పంచే ఐదు సంవత్సరాల పాటు సర్పంచ్ బాధ్యతలు నిర్వహించారు. జనాభా లెక్కల్లో భార్యభర్తలు మాత్రమే ఎస్సీలుగా ఉండి ఓటుహక్కు లేకపోయినప్పటికీ ఆ పంచాయతీ ఎన్నికల్లో ఖానాపురాన్ని ఎస్సీకి రిజర్వు అయింది. ఈ రిజర్వేషన్ ప్రకారమే ఎన్నికలు నిర్వహించారు. కేవలం 8వార్డులకు మాత్రమే రిజర్వేషన్ ప్రకారం ఎన్నికలు జరిగాయి. సర్పంచ్ పదవికి పోటీచేసేందుకు ఎస్సీ సామాజిక వర్గం నుంచి ఎవరూ లేకపోవడంతో ఆ ఎన్నిక జరుగలేదు. దాంతో 2013నుంచి 2018వరకు ఐదు సంవత్సరాలు ఖానాపురం ఉపసర్పంచ్ మారబోయిన ఏడుకొండలు సర్పంచ్ బాధ్యతలు నిర్వహించారు.



పంచాయతీ కార్యాలయం



ఖానాపురానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న గన్నవరం గ్రామానికి చెందిన కోట ప్రసాద్, మరియమ్మ దంపతులు ఖానాపురంలో ఒక బడ్డీ కొట్టు పెట్టుకొని జీవనం కోసం చిరువ్యాపారం చేసుకునేవారు. ప్రతిరోజూ తమ గ్రామం నుంచి ఖానాపురం వచ్చి ఇంటికి వెళ్లేవారు. 2011లో జరిగిన జనాభా లెక్కల సమయంలో కోట ప్రసాద్ దంపతులు ఖానాపురం జనాభా లెక్కల్లో తమ పేర్లు రాయించుకున్నారు. అయితే ఆ ఇద్దరి ఓట్లు తమ స్వగ్రామంలోనే ఉండిపోయాయి. ఓట్లను ఖానాపురానికి మార్చుకోలేదు. జనాభా లెక్కల్లో కేవలం భార్యభర్తలు ఎస్సీలుగా ఉండటంతో 2013 ఎన్నికల్లో ఖానాపురం పంచాయతీని ఆ సామాజిక వర్గానికి రిజర్వు చేశారు. ఆ సమయంలో గన్నవరంలో ఉన్న తమ ఓట్లను ఖానాపురానికి మార్పించుకునేందుకు ప్రసాద్, మరియమ్మ ప్రయత్నించినప్పటికీ సాధ్యపడలేదు. చివరికి సర్పంచ్ ఎన్నిక లేకుండా 8వార్డులకు మాత్రమే ఎన్నికలు జరిగాయి. ఎన్నికైన వార్డుమెంబర్లలో మారబోయిన ఏడుకొండలుకు ఉపసర్పంచ్ పదవి దక్కింది. ఆయనే సర్పంచ్ విధులు నిర్వహించారు. ఆ ఐదేళ్ల కాలంలో సర్పంచ్ పదవికి ఎన్నికల నిర్వహణ కోసం ప్రభుత్వం నాలుగైదుసార్లు నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ ఎస్సీ సామాజిక వర్గం ఓటర్లు లేకపోవడంతో ఎన్నిక నోటిఫికేషన్‌కే పరిమితమైంది. ప్రస్తుతం వెలువడిన ఎన్నికల షెడ్యూల్‌లో ఖానాపురంకు ఎస్టీకి రిజర్వు అయింది.

తోట కుటుంబానికి మంత్రి తుమ్మల పరామర్శ

ఏన్కూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాచారం గ్రామానికి చెందిన కమ్మ సంఘం అధ్యక్షుడు తోట రాధాకృష్ణ తల్లి మాణిక్యమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం ఆమె దశదిన కర్మకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ వేర్వేరుగా హాజరై ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, తుమ్మల ముఖ్య అనుచరుడు గుత్తా వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు స్వర్ణ నరేంద్రకుమార్, మార్కెట్ కమిటీ చైర్మ న్ గుగులోత్ లచ్చిరాం నాయక్, వైస్‌చైర్మన్ మల్లం గంగులు మాజీ ఎంపీటీసీ మేడ ధర్మారావు మాజీ ఎంపీపీలు ఆరెం వరలక్ష్మి, ముక్తి వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీడైరెక్టర్ శోభన్‌నాయక్, టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తిజనార్ధన్ మాజీమండల అధ్యక్షుడుకొనకంకి రామకృష్ణ , మండల నాయకులు బానోతు రామారావు ,మాదినేని లెనిన్, తాళ్లూరి అపన్నారావు, యండ్రాతిశ్రీను, ఆరెం రామయ్య, కొప్పుల ప్రభావతిరెడ్డి, వాసిరెడ్డి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మాణిక్యమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తుమ్మల

మృతుడి కుటుంబానికి రూ.20వేల సాయం

ముదిగొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం బాణాపురం గ్రామానికి చెందిన మరికంటి నాగేశ్వరరావు ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా అతడి కుటుంబానికి రూ.20వేల ఆర్థిక సహాయాన్ని గ్రామస్థులు అందజేశారు. ఆదివారం నాగేశ్వరరావు భార్య కృష్ణవేనికి రూ.20వేల నగదును అందజేశారు. త్వరలో రూ.67వేల నగదును ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్‌ను అంజేయనున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

వైరా జడ్పీటీసీకి నలుగురు పేర్లు?

» నూతి సత్యనారాయణకే ఎక్కువ అవకాశాలు

వైరా, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): వైరా (బీసీ జనరల్)జడ్పీటీసీ స్థానానికి కాంగ్రెస్ పార్టీ నలుగురు నాయకుల పేర్లు ఖరారు చేసి డీసీసీ ద్వారా టీపీసీసీకి పంపించారు. శనివారం వైరాలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ నిర్వహించిన అభ్యర్థుల ఎంపిక సమావేశంలో స్నానాల లక్ష్మీపురం గ్రామానికి చెందిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ, రెబ్బవరం మాజీ సర్పంచ్ గుత్తా కళావతి, ఖానాపురానికి చెందిన షేక్.రఫీ, అష్టగుర్తి మాజీ సర్పంచ్ ఇటుకల మురళీ పేర్లను ఖరారు చేసి ప్రతిపాదనలు పంపించారు.

శ్రీ మృత్యుంజయస్వామికి అన్నాభిషేకం

సత్తుపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కల్పతరువు రోడ్డులోని శ్రీ విశ్వజ్ఞాన పీఠం 8వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఛండీహోమం, శ్రీ మృత్యుంజయస్వామికి అన్నాభిషేకం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేద పండితులు రవిశాస్త్రీ గురుస్వామి ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల నడుమ డప్పువాయిద్యాలు మేళతాళాల మధ్య శ్రీ లలితాదేవి అమ్మవారికి చీరె, సారెలను ఊరేగింపుగా తెచ్చి సమర్పించారు. ఈ సందర్భంగా ఆయుధపూజ అనంతరం 11రోజుల పాటు లలితాదేవి దీక్షలు చేపట్టిన భక్తులు మాలధారణ విరమించగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్.విశ్వనాధరెడ్డి, ఎస్.గణేష్‌రెడ్డి, రమేష్, కృష్ణార్జునరావు, చింతకాయల దివ్య, స్రవంతి, నాగేశ్వరరావు, రాంబాబు, ఎం.చంద్రశేఖర్, డీ.నారాయణ, బ్రహ్మం తదితర భక్తులు పాల్గొన్నారు.



అమ్మవారి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కలిసొచ్చే పార్టీలతో ఎన్నికల సర్దుబాటు

వైరా, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సీపీఎంతో ఎన్నికల్లో కలిసొచ్చే పార్టీలతో సర్దుబాటు చేసుకుంటామని అందువల్ల సీపీఎం అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు కృషిచేయాలని ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం పిలుపునిచ్చారు. ఆదివారం వైరాలో మాజీ సర్పంచ్ పారుపల్లి కృష్ణారావు అధ్యక్షతన జరిగిన విప్పలమడక, లింగన్నపాలెం సీపీఎం గ్రామశాఖ సభ్యుల సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు, విప్పలమడక, లింగన్నపాలెం మాజీ సర్పంచ్‌లు తుమ్మల జాన్‌పాపయ్య, బాణాల వెంకట్రావమ్మ, నాగేశ్వరరావు, సుధాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భూక్యా వీరభద్రం

సరైన మార్గాన్ని చూపేది కమ్యూనిస్టులే

» సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం

బోనకల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సరైన మార్గాన్ని చూపేది కమ్యూనిస్టులేనని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం తెలిపారు. మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో ఆదివారం మాజీ సర్పంచ్ మాదినేని నారాయణ రెండవ కుమారుడు రిటైర్డ్ జడ్జి రాధాకృష్ణ దశదిన కర్మకు హాజరై నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాదినేని కుటుంబం విలువలకు కట్టుబడిన రాజకీయ నేపథ్యంతో పేరు తెచ్చుకున్నారని ఆయన ప్రశంసించారు. సమాజంలో జడ్జీగా రాధాకృష్ణ వృత్తిధర్మం పాటించి అందరి మన్ననలను పొందారని కొనియాడారు. సీపీఎం రాష్ట్ర, జిల్లా నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, నున్నా నాగేశ్వరరావు, పొన్నం వెంకటేశ్వరరావు, మన్నెపల్లి సుబ్బారావు, మడిపల్లి గోపాలరావు, మాదినేని రమేష్, పాపినేని రాంనర్సయ్య, ఎర్ర శ్రీనివాసరావు, సత్యనారాయణ, చింతలచెర్వు కోటేశ్వరరావు, సురేష్, దొండపాటి నాగేశ్వరరావు, రమేష్, జొన్నలగడ్డ సునిత పాల్గొన్నారు.



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తమ్మినేని

మధిరలో మంత్రి పొంగులేటీ పర్యటన

మధిర రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మధిర మండలంలోని అత్కూర్, ఇల్లూరు, సిద్దినేనిగూడెం గ్రామాల్లో ఆదివారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటీ శ్రీనివాసరెడ్డి పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అత్కూరులో కంభంపాటి సురేష్ వివాహ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఇల్లూరు గ్రామంలో మాజీ సర్పంచ్ కోట రామారావు కుమారుడి వివాహం ఇటీవల జరిగింది. వారి ఇంటికి వెళ్లి నూతన దంపతులను ఆశీర్వదించారు. మర్లపాడు గ్రామంలో వేమిరెడ్డి లక్ష్మారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కోట రాంబాబు, అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, దేవిశెట్టి రంగా, కటికల సీతారామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అత్కూర్‌లో శుభకార్యంలో పాల్గొన్న మంత్రి

పోటీకి సై అంటున్న ఆశావహులు

» అధికార పార్టీలో ఆశావహులు సందడి
» జడ్పీటీసీకి పలువురు సిద్ధం
» ముగ్గురు పేర్లతో అధిష్ఠానానికి జాబితా

సత్తుపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా జడ్పీటీసీ స్థానాల్లో పోటీ చేసేందుకు సత్తుపల్లి నియోజకవర్గంలోని 5మండలాల్లో అధికార పార్టీ నుంచి ఆశావహుల సంఖ్య ఎక్కువగానే ఉంది. నియోజకవర్గంలో 5జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. ఆయా స్థానాల్లో పోటీ చేసేందుకు అధికార పార్టీకి చెందిన మండల స్థాయి నాయకులు ఉత్సాహం చూపుతున్నారు. ఈ క్రమంలో ఒక్కో మండలం నుంచి మండల కాంగ్రెస్ ద్వారా నియోజకవర్గ నాయకత్వానికి పెద్ద సంఖ్యలో పేర్లు వచ్చాయి. వీటిని పరిశీలించి ప్రతి మండలం నుంచి మూడేసి పేర్ల చొప్పున అధిష్ఠాన వర్గానికి పేర్లు సూచించాలని కోరిన విషయం విధితమే. ఈ క్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకత్వం మండలాల నుంచి వచ్చిన పేర్లను పరిశీలించి గెలిచే అవకాశాలు ఉన్నవారిని ప్రతిపాదించినట్లు తెలిసింది. అర్థబలం, అంగబలం, సామాజిక వర్గాల సమీకరణలు దృష్టిలో ఉంచుకుని మూడేసి పేర్ల చొప్పున ఎంపికచేసి అధిష్ఠాన వర్గానికి జాబితా పంపినట్లు తెలిసింది.

మండలాల వారీగా ఆశావహులు..

వేంసూరు మండలం జడ్పీటీసీ స్థానం బీసీ జనరల్‌కు రిజర్వు కాగా 12మంది నాయకులు పోటీ పడుతున్నారు. వీరిలో అధిష్ఠానం ఆదేశం మేరకు ముగ్గురుని ఎంపికచేసి పేర్లు పంపినట్లు తెలుస్తోంది. వేంసూరు జడ్పీటీసీ స్థానానికి పల్లెవాడకు చెందిన మల్లేల నరసింహారావు, ఎండీ.ఫైజుద్దీన్, ఎండీ.ఇమామ్‌పాషా, బింగి గాంధీబాబు, బొమ్మనబోయిన వెంకటేశ్వరరావు, జి.వెంకటరమణ, ఇమ్మడి శివ, రావుల పుల్లారావు, కర్రి నాగేశ్వరరావు, జెట్టి రామారావు, రావి సత్యనారాయణ, వంట్ల విశ్వేశ్వరావులు పోటీ పడుతున్నారు. సత్తుపల్లి జడ్పీటీసీ స్థానం గిరిజన మహిళకు రిజర్వు కావడంతో ఇక్కడి నుంచి పలువురు పోటీ పడుతుండగా కీసర కృష్ణనాగు, అజ్మీర భారతి, కుర్సా కృష్ణవేణిల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. పెనుబల్లి జడ్పీటీసీ బీసీ మహిళకు కేటాయించారు. మండల కాంగ్రెస్ నుంచి ఆరుగురు అభ్యర్థులను ప్రతిపాదించినట్లు తెలిసింది. వీరిలో సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు బుక్కా కృష్ణవేణి, వంకాయలపాటి రేష్మ, ఈడా రామసీత, కావిటి వెంకటనర్సమ్మ, పొట్లపల్లి కృష్ణవేణి, మల్లెల్ల వరలక్ష్మిలు ఉన్నారు. కల్లూరు జడ్పీటీసీకి ఎస్సీ మహిళ రిజర్వు కాగా ఏడుగురు అభ్యర్థుల పేర్లను ప్రాథమికంగా పరిశీలించి వీరి నుంచి కొన్నిపేర్లను అధిష్ఠానవర్గానికి ఎంపికచేసి పంపినట్లు సమాచారం. ప్రాథమిక పరిశీలనలో మర్సకట్ల ప్రమీళ, కంచెపోగు పుష్ప, మాగంటి శ్రీలత, నల్లగట్ల మేరీ, ఇనపనూరి రాజేశ్వరి, బర్రె అరుణ, గుజ్జు పద్మల పేర్లు ఉన్నట్లు తెలిసింది. తల్లాడ జడ్పీటీసీ ఎస్సీ మహిళకు రిజర్వు అయ్యింది. ఈ మండలం నుంచి ప్రధానంగా ముగ్గురు పేర్లు వినిపిస్తున్నాయి. తేళ్లపుట్ట మాధవి, కంచెపోగు వరమ్మ, గుజ్జర్లపూడి మౌనిక పేర్లను పార్టీ నాయకత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం.

బత్తినేని ట్రస్టు ఆధ్వర్యంలో వైద్య శిబిరం విజయవంతం

బోనకల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): బోనకల్‌లో ఆదివారం బత్తినేని చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. బీపీ, షుగర్ వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు మాట్లాడుతూ.. అమరజీవి కామ్రేడ్ తూము ప్రకాశరావు ఆశయ సాధన కోసం ఆయన మనవళ్లు బత్తినేని ట్రస్టును స్థాపించి పేదల కోసం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యంగల గిరి, కాకాటి కరుణాకర్, గొల్లపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



మందులను పంపిణీ చేస్తున్న యంగల ఆనందరావు



వైరాలో నరేన్ ఆస్పిటల్‌లో హెల్త్‌క్యాంపు నిర్వహిస్తున్న వైద్యులు

వైరాలో..

వైరా: వైరాలోని నరేన్ ఆస్పిటల్‌లో ఆదివారం ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించారు.క్యాంపులో పాల్గొన్న వారికి వైద్యులు డయాబెటిక్ పరీక్షలు నిర్వహించి అవసరం అయిన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ.. డయాబెటిక్ పట్ల నిర్లక్ష్యం చేయవద్దన్నారు. డయాబెటిక్ ఉన్నవారు క్రమం తప్పకుండా వైద్యులు సలహాలు తీసుకుంటు మందులతో పాటు వాకింగ్ చేయాలన్నారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరికి రక్తపరీక్షలు చేశారు.

కానిస్టేబుల్ కుటుంబంపై దాడి

» కారును అడ్డగించి మహిళలపైనా దౌర్జన్యం

చింతకాని, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులోని శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి దైవ దర్శనానికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న ఓ కానిస్టేబుల్ కుటుంబంపై చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన కొంత మంది పోకిరీ యువకులు నాగులవంచ ప్రధాన సెంటర్‌లో దాడి చేసి గాయపర్చారు. నేలకొండపల్లి మండలం బోదులబండ గ్రామానికి చెందిన కట్టెకోల శ్రీనివాస్ ఏపీఎస్‌పీ 3వ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం కుటుంబ సభ్యులతో కలసి పెనుగంచిప్రోలు శ్రీ లక్ష్మీతిరుపతమ్మతల్లి దర్శనానికి వెళ్లాడు. అనంతరం సాయంత్రం ఖమ్మంలోని ఇంటికి తిరుగుప్రయాణమయ్యారు. ఇంటికి వస్తున్న క్రమంలో దారిలో మక్కపేట వద్ద పాతర్లపాడు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై కారును వెంబడించారు. పలుమార్లు కారును ఓవర్‌టేక్ చేస్తూ భయభ్రాంతులకు గురిచేశారు. వత్సవాయి వద్ద కారు నిలిపి ప్రశ్నించిన కానిస్టేబుల్‌తో దుర్భాషలాడారు. కానిస్టేబుల్ కారులో కుటుంబ సభ్యులు మహిళలు, చిన్న పిల్లలు ఉండడంతో 100కు డయల్ చేసి సమాచారం ఇచ్చాడు. 100 నుంచి కాల్ రావడంతో బోనకల్ పోలీసులు అప్రమత్తమయ్యారు. రోడ్డుపై కాపు కాచి యువకులను పట్టుకునేందుకు ప్రయత్నించారు. పోలీసులను గమనించిన యువకులు అక్కడ నుంచి తప్పించుకుని కారు కంటే ముందుగా నాగులవంచ గ్రామం చేరుకున్నారు. ఇద్దరు యువకులు పాతర్లపాడు గ్రామం నుంచి మరికొంత మంది యువకులను పిలుపించుకుని నాగులవంచ గ్రామ ప్రధాన కూడలిలో ఖమ్మం- బోనకల్ రహదారిపై కానిస్టేబుల్ కారును గుర్తించి అడ్డుకున్నారు. కారులో నుంచి కానిస్టేబుల్‌తో పాటు కుటుంబ సభ్యులైన మహిళలను బయటకు లాగి దాడి చేయడమే కాకుండా మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కెల్లారు. దీంతో రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ వీరేందర్ సిబ్బందితో వెళ్లి ఘటనకు సంబంధించి ప్రాథమిక వివరాలు సేకరించారు. కానిస్టేబుల్ శ్రీనివాస్ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు

ఏన్కూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గుడ్ల వెంకటేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఆదివారం ఏన్కూరులో సంఘం గౌరవ అధ్యక్షుడు బస్మాంగి నాగేశ్వరరావు అధ్యక్షతన అసోసియేషన్ మండల మహాసభ ఆదివారం జరిగింది. ప్రధాన కార్యదర్శిగా పాలెపు పాపారావు, కోశాధికారిగా దొడ్డ శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులుగా జవ్వాజి శ్రీనివాసరావు, కొపెల రామారావు, షేక్ హుస్సేనుద్దీన్, షేక్ అన్వర్‌లను ఎన్నుకున్నారు. బి. మోహన్, బి.శ్రీనివాసరావు, వంశీకృష్ణ, షేక్‌పెంటు సాహెబ్, షేక్ జానీ, తుమ్మపల్లి మధు, ఉపేందర్‌పాల్గొన్నారు.



ఎన్నికైన అసోసియేషన్ సభ్యులు

జాతి వైరం మరిచిన కుక్క పిల్లి



ఏన్కూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా ఏన్కూరులో ఓ వింత సంఘటన జరిగింది. సహజంగా కుక్క, పిల్లికి జాతి వైరం ఉంటుంది. కుక్క దాడి చేస్తుందనే భయంతో పిల్లిపారిపోతుంది. కానీ జన్నారం క్రాస్‌రోడ్డులో సిలివేరుసుబ్బారావు దుకాణంలో గత కొన్ని నెలల నుంచి పిల్లి కుక్కతో స్నేహం చేస్తోంది. కుక్క కూడా పిల్లి బాగోగులను చూస్తుంది. శరీరంపై పడుకొబెట్టుకుని పిల్లిని జాగ్రత్తగా చూస్తుంది. మనుషులు మధ్య వైషమ్యాలు ఉంటున్న నేటి సమాజంలో కుక్క, పిల్లి స్నేహం స్థానికులను ఆశ్చర్యపరుస్తోంది. స్థానికులు ఈ దృశ్యాన్ని ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఈ దృశ్యాలను ఆంధ్రజ్యోతి తన కెమేరాలో బంధించింది.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

తల్లాడ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆరుపదుల వయసులో ఒక స్నేహితుడి కృషితో చదువుకున్న పాఠశాల వేదికగా పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక ఆదివారం మండలలోని కుర్నవల్లి గ్రామంలో జరిగింది. విదేశాలలో స్థిరపడి ఉన్నవారు కొందరయితే, ఇతర రాష్ట్రాలలో, జిల్లాల్లో కుమారులు, కుమార్తెల దగ్గర ఉంటున్న వారు మరికొందరు ఏ ప్రాంతంలో ఉన్నా వారందరు చిన్న తనంలో చేసిన చిలిపి పనులు, కలబడిన కలహాలను గుర్తుచేసుకుంట ఆ వయస్సులో తమతో కలిసి ఆడుకన్న స్నేహితుల ఎలా ఉన్నారో చూడాలని తమకు జీవిత పాఠాలు నేర్పిన బడిలో కలుసుకున్నారు. 1984-85లో కుర్నవల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు 41 ఏళ్ల తర్వాత బాల్యస్నేహితుడైన యన్నం శ్రీనివాసరెడ్డి కృషితో గురువులతో కలిసి కలుసుకుని సందడి చేశారు. ఎదనిండా సంతోషాలతో తమ గురువులను సన్మానించుకుని వివిధరకాల వంటకాలతో భోజనం చేసి కలకాలం కలిసుందామని ఒకరికి ఒకరు చెప్పుకుని గత స్మృతుల సవ్వడితో వెనుదిరిగారు.



బేతుపల్లిలో మిషన్ భగీరథ నీరు వృథా

» నీటి తాకిడితో నేలకొరిగిన వరిపైరు

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించే మిషన్ భగీరథ నీరు కాస్తా పైప్‌లైన్‌లో ప్రమాదం సంభవించడంతో నీరు వృథాగా పారుతూ వరి పంటకు నష్టం వాటిల్లిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని బేతుపల్లిలోని నల్లవాగు సమీపంలోని చెన్ను చంద్రయ్య అనే రైతుకు చెందిన వరిపొలం కోతకు రాగా మిషన్ భగీరథ పైప్‌లైన్ ప్రమాదవశత్తు పగిలిపోగ నీరు లీకవ్వడంతో పంట కాస్తా నేలకొరిగింది. ఈ లీకేజీ వల్ల నీటి వృథా జరగడమే కాకుండా స్థానిక ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని, ఎప్పుడు ఇలాంటి ప్రమాదభరిత సంఘటన జరిగిన తాత్కాలిక మరమ్మతుల చేస్తున్నారు. శాశ్వతంగా పరిష్కరించకపోవడంతో ఇలాంటి సమస్యలు ఎదురవుతున్నాయని, తమకు న్యాయం చేయాలని బాధిత రైతు కోరుతున్నాడు.



నీళ్లు పారడంతో నేలకొరిన వరిపంట



పైపులైన్ వద్ద నుంచి లీకవుతున్న నీరు

ప్రమాదకరంగా ప్రయాణం

తల్లాడ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులకు వేలాడుతూ ఎంతో ప్రమాదకరంగా ప్రజలు ప్రయాణిస్తున్నారు. దసరా సెలవులు ముగియడంతో స్వస్థలాలు, విద్యాసంస్థలకు చేరుకునేందుకు ఆదివారం ప్రయాణికులు తల్లాడ బస్టాండ్‌లో పోటెత్తారు. సరిపడా బస్సులు లేకపోవడంతో బస్సులు ఎక్కేందుకు ప్రయాణికులు పోటీపడ్డారు. బస్సులో సరిగా నిల్చోడానికి కూడా అవకాశం లేని పరిస్థితిలో ఫుట్‌బోర్డుపై వేలాడుతూ ప్రమాదకరంగా స్వస్థలాలకు వెళ్లాల్సిన రావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



బస్సుకు వేలాడుతున్న ప్రయాణికులు

ఎర్రనేలలో ఎంపీపీ పీఠంపై తీవ్ర పోటీ

» కాంగ్రెస్, సీపీఎం పొత్తు పొడిచేనా?
» గులాబీ పార్టీ స్థానిక పోరులో ఒంటరి కానుందా?
» ఎంపీ, జడ్పీటీసీ స్థానాలు బీసీలకు కావడం పైనే సర్వత్రా చర్చ

బోనకల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సీపీఎం పార్టీకి కంచుకోటగా బోనకల్ మండలానికి ప్రత్యేకమైన చరిత్ర ఉంది. వామపక్ష ఉద్యమాలు, పోరాటాలకు పుట్టినిల్లుగానూ, ఇక్కడ ప్రజలు చైతన్యవంతులుగా పేరుంది. మండల పరిషత్ వ్యవస్థ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ సీపీఎం పార్టీకి చెందిన వారే ఎంపీపీలుగా ఉన్నారు. ఒక్క పర్యాయం మినహా మిగిలిన అన్ని సార్లు జడ్పీటీసీలు కూడ ఈ పార్టీకి చెందిన వారే ఉన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపు తరువాత కాంగ్రెస్ స్థానిక పోరుకు దిగడంతో ఎర్రకోటగా చెప్పుకునే బోనకల్ మండలంలో మరోసారి ఎంపీపీ పీఠపై ఆశావాహుల్లో పోటీ పై సర్వత్రా ఉత్కంఠత నెలకొంది. ఎంపీపీ బీసీ జనరల్‌కు, జడ్పీటీసీ స్థానం బీసీ మహిళకు రిజర్వు అయింది. మండలంలో మొత్తం 13 ఎంపీటీసీ స్థానాలు ఉండగా 36,381 మంది ఓటర్లు ఉన్నారు. 5 ఎంపీటీసీ స్థానాలు బీసీలకు, 3 స్థానాలు జనరల్‌కు, 4 స్థానాలు ఎస్సీలకు, ఒక స్థానం ఎస్టీ క్యాటగిరి అభ్యర్థులకు రిజర్వు అయ్యాయి. గత స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఎం పొత్తు పెట్టుకొని ఎంపీపీ సీపీఎంకు, జడ్పీటీసీ కాంగ్రెస్ గెలుచుకుంది. తాజాగా జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఎంతో పొత్తు పెట్టుకుంటుందా? లేదా? అన్న చర్చ జోరుగా సాగుతుంది. రెండు పార్టీలు జత కడితే గులాబీ పార్టీ ఒంటరిగా బరిలో దిగుతుందా? లేదా సీపీఎంతో సంప్రదింపులు జరిపి సీట్ల సర్దుబాటు చేసుకుంటుదా? అన్న చర్చలు జరుగుతున్నాయి. ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు బీసీలకు రిజర్వు కావడంతో జనరల్ క్యాటగిరి అభ్యర్థుల్లో నైరాశ్యం నెలకొంది. బీసీలలో మాత్రం రిజర్వేషన్లల్లో భాగంగా తమకు ఎంపీపీ పీఠం వస్తుందన్న ఆశల పల్లకిలో ఆశావాహులు ఉగిసలాడుతున్నారు.